పెన్ పవర్
తెలంగాణ రౌండప్



80 గజాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా, 6 అంతస్తుల అక్రమ నిర్మాణం..

- నిజాంపేట్ సర్కిల్ 'సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్'లో 'ఆకాశహర్మ్యాలు'..
- అనుమతులు ఉంటేనే కదా ఆంక్షలు..! ఆ పర్మిషన్‌లే లేకపోతే 'హద్దేముంది'..?
- నిజాంపేట్ సర్కిల్-58లో టౌన్‌ప్లానింగ్ విభాగం ఉందా లేదా..? అనే సందేహాలు..!
- అధికారుల కళ్ళెదుటే 'ఆకాశహర్మ్యాలు' నిర్మాణాలపై వార్తలు వస్తేనే షర్యలా..?
- ఎలాంటి అనుమతుల్లేని ప్రమాదకర అక్రమ కట్టడాలపై 'నిర్లక్ష్యమా-ముడుపులా'..?
- నిజాంపేట్ సర్కిల్‌కి వచ్చే ఆదాయం కంటే..! అక్రమార్జనే అధికం, అంటూ ఆరోపణలు..?
- అక్రమార్కులతో చేతులు కలిపి ప్రజలను రిస్కులో పెడుతున్న టౌన్‌ప్లానింగ్..

# అనుమతుల్లేని- ఆకాశహర్మ్యాలు..!

## పేరుకే పేదల బస్తీ.. 80 గజాల్లో '5-6' అంతస్తులు..! పర్మిషన్‌లు నిల్..!

నిత్యం ఫీల్డ్‌లో తిరిగే చైన్‌మెన్‌ల వ్యవస్థ (ఔట్ సోర్సింగ్) అసిస్టెంట్ సిటీ ప్లానర్- టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్- వీళ్ళందరిపై సర్కిల్ మొత్తానికి ఒక డిప్యూటీ కమిషనర్.. వీళ్ళను ఎప్పటికప్పుడు అక్రమ కట్టడాలపై మీడియా-సోషల్ మీడియాలో వార్తా కథనాల తోపాటు, స్థానికుల ఫిర్యాదులు.. ఇవన్నీ దాటుకుని దాదాపు 6-8 నెలలు నిర్మించే అక్రమ కట్టడాలు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలియకుండా సాధ్యమేనా..? అనే విమర్శలు తలెత్తుతున్నాయి.. ఇప్పటికే అనుమతులు తీసుకున్న ప్రతి భవన నిర్మాణంలో నూటికి 99 శాతం "అక్రమ అదనపు అంతస్తులు-సెట్‌బ్యాకుల ఆక్రమణ-మరికొన్ని చోట్ల అక్రమ సెల్లార్‌లు- నిర్మాణ అనుమతులు ఒకచోట-నిర్మాణం మరోచోట.. వీటికి తోడు ఇప్పుడు రాజీవ్ గాంధీ నగర్ లాంటి బస్తీలు మురికి వాడల కింద పేదల బస్తీలుగా చూపెడుతూ, ఆకాశహర్మ్యాలు నిర్మిస్తుంటే..! అక్రమ కట్టడాలు పూర్తయ్యే వరకు టౌన్‌ప్లానింగ్ దృష్టిలో లేనట్టు వ్యవహరించడం, ఆతర్వాత నోటీసులు-సీజింగ్‌లు- టౌన్‌ప్లానింగ్ శైలిలో ఒప్పందపు పాక్షిక కూల్చివేతలు.. అయినప్పటికీ అక్రమ కట్టడంలో ఎలాంటి మార్పులు ఉండవు.. ఇదంతా టౌన్‌ప్లానింగ్ విభాగం చేతిలో 'గారడి చేష్టలు' అంటూ సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 8:

-4లో



నిజాంపేట్ సర్కిల్, రాజీవ్ గాంధీ నగర్‌లో.. అనుమతుల్లేని బహుళ అంతస్తులు..

## ఫాగింగ్ లేకపాయే దోమలు పెరిగిపోయే

-మిగతా 6లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## 'జిఎల్‌సి'లో అక్రమ నిర్మాణాలకు.. ఎట్టకేలకు నోటీసులు..

### మై క్యూర్ సిటిజెన్ యాప్‌లో దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసిపి సమాధానం..



- 'జీఎల్‌సి' ఆక్రమిత ప్రభుత్వ భూమిలో.. అక్రమ కట్టడాలపై స్పందించిన ఏసిపి..
- మల్లంపేట్ సర్వే నెం.170/3 పేరుతో ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మాణాలు..?
- లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ బిల్డర్ కొనుగోలు చేసిన భూమి కంటే, అదనంగా కబ్జా..?
- ఆక్రమించిన ప్రభుత్వ భూమిని తెలివిగా తన బినామీల పేరుమీద రిజిస్ట్రేషన్‌లు..
- ప్రభుత్వ భూమిపై రెవెన్యూ..! అక్రమ కట్టడాలపై టౌన్‌ప్లానింగ్ ఉదాసీనత..
- ఈ మధ్యనే 'మైక్యూర్ సిటిజెన్ యాప్‌లో స్థానికుల ఫిర్యాదుకు స్పందన..
- నోటీసులు జారీ చేసినట్లు దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల సమాధానం..

-5లో

## పెట్టుబడులు రావొద్దనేదే బీఆర్ఎస్ ఉద్దేశం



హైదరాబాద్ పెన్ పవర్: రైతుల దీక్షకు సంఘీభావం పేరిట బీఆర్ఎస్ అనవసర రాజకీయాలు చేస్తున్నదని.. పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకునేలా ప్రజలను తప్పుదోవ పట్టించేలా యాత్రలు చేపడుతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటనలో పేర్కొన్నారు. ఇది వారికి తగదని సూచించారు. వికారాబాద్ జిల్లాలో జరుగుతున్న భూసేకరణపై పనిగట్టుకుని ప్రభుత్వంపై బురద చల్లేందుకే రాజకీయ యాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వెనుకబాటుకు గురైన వికారాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేకనే మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా మార్చేందుకు తాము అహర్నిశలు కృషి చేస్తున్నామని.. తట్టుకోలేక తమపై బురద జల్లుతున్నారని దుయ్యబట్టారు. పెట్టుబడులు రాకుండా.. యువతకు ఉపాధి దక్కకుండా అసత్యాలను వండి వార్చుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు భూములు అవసరమని.. ఇప్పటికే ఆపరేషన్‌లో ఉన్న చందనవెల్లి, సీతారాంపూర్ తదితర

-6లో

# అనుమతుల్లేని- ఆకాశహర్మ్యాలు..!



రాజీవ్‌గాంధీ నగర్ స్లమ్ ఏరియాలో ధనికుల అక్రమ కట్టడాలు..



రాజీవ్‌గాంధీ నగర్ నిజాంపేట్ సర్కిల్-58..



నిజాంపేట్ సర్కిల్ రాజీవ్ గాంధీ నగర్‌లో అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలు..

## 80 గజాల్లో '5-6' అంతస్తులేంటి..?

నిజాంపేట్ సర్కిల్ పరిధి రాజీవ్ గాంధీ నగర్‌లో అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి.. బస్తీలో ఎక్కడ చూసిన మేడలు దర్శనమిస్తున్నాయి.. కేవలం 80 గజాల స్థలంలో ఆకాశహర్మ్యాలు వెలుస్తుండటం, టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.. నిజాంపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు రాజీవ్ గాంధీ నగర్ మొత్తం పేదల బస్తీ, మురికివాడగా పేర్కొంటూ పర్మిషన్‌లు లేవని చెబుతున్నారు.. గత కొన్ని నెలలుగా టౌన్‌ప్లానింగ్ సెక్షన్ రద్దు చేశారో ఏమో తెలియదు కానీ..! రాజీవ్ గాంధీ నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా 80 గజాల్లో స్థాయికి మించి బహుళ అంతస్తుల నిర్మాణాలు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.. ఏమైనా ప్రమాదాలు సంభవిస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు..

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇప్పటికైనా స్పందించాలి.. ఈ శివారు ప్రాంతాలు, కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఎనిమిదేళ్ళకు ముందు వరకు గ్రామ పంచాయతీలుగానే రాజ్యమేలాయి.. 2017-18 సమయంలో పరిపాలనా సౌలభ్యం అంశంతో దుండిగల్-నిజాంపేట్, కొంపల్లి, గుండ్ల పోచంపల్లి తోపాటు హైదరాబాద్ మహానగరం చుట్టూ మరికొన్ని మున్సిపాలిటీలుగా ఆవిర్భావించాయి.. ఇప్పుడు జీహెచ్ఎంసిలో విలీనమైనా.. టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ తీరుతెన్నుల్లో ఏమాత్రం మార్పు లేకపోవడం గమనార్హం..కుత్బుల్లాపూర్ జోన్ సిఎంసి పరిధిలోని దుండిగల్-నిజాంపేట్- కొంపల్లి తోపాటు గాజులరామారం, జీడిమెట్ల సర్కిల్‌లలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాల దందా కొనసాగుతుంది.. గాజులరామారంలో మొన్న జరిగిన సెల్లార్ ప్రమాదం ప్రత్యేక ఉదాహరణ.. ఇపుడు నిజాంపేట్ సర్కిల్ పరిధి రాజీవ్‌గాంధీ నగర్‌లో ఆకాశానికి తగిలే అక్రమ బహుళ అంతస్తులు టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలియకుండా సాధ్యమేనా సిఎంసి కమిషనర్ తేల్చాలి.. టౌన్‌ప్లానింగ్ మాఫియాగా ఎందుకు పేర్కొన కూడదో..! ప్రజలు ప్రశ్నిస్తున్నారు.**

- 3 పేజి తరువాయి

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ సర్కిల్-58 పరిధిలో ప్రజలను ప్రమాదంలో పెట్టే, ప్రమాదకర అక్రమ కట్టడాలు, సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే నిర్మితమవుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని, రాజీవ్ గాంధీ నగర్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం హయాంలోనే పేదలకు 80 గజాల పట్టాలు జారీ చేసినట్లు సమాచారం.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఎనిమిదేళ్ళు నిండాయి.. తాజాగా జీహెచ్ఎంసిలో విలీనమై, మూడు విభాగాలుగా విభజించి..! ప్రస్తుతం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో భాగమైంది.. పరిపాలనా సౌలభ్యం- ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం పాట్లు పడుతుంటే..! నిజాంపేట్ సర్కిల్-58 'సిఎంసి' టౌన్‌ప్లానింగ్ 'అధికారులు-చైన్‌మెన్'లు నిర్లక్ష్యపు విధుల కారణంగా, ప్రజలను రిస్కులో పెడుతున్నారు.. అందుకు ప్రత్యక్ష సాక్ష్యాలు ఈ ఆకాశహర్మ్యాలు..! అక్రమ నిర్మాణాలు చేపడుతున్న సమయంలో చోద్యం చూస్తున్న అధికారులు, పేపర్లో వార్తలు వచ్చాయని, ఫిర్యాదులు అందాయని, హడావుడిగా, అధికారుల తూతూ మంత్రపు చర్యలు టౌన్‌ప్లానింగ్ 'చేతివాటాన్ని' ప్రదర్శిస్తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

## జీహెచ్ఎంసిలో విలీనమైనా..! స్లమ్ ఏరియాగానే..!


నిజాంపేట్ సర్కిల్ సిఎంసి టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారుల విధుల తీరు, తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. మహానగరంలో భాగమైన నిజాంపేట్ సర్కిల్-58 పరిధిలోని బాచుపల్లికి వెళ్ళేదారిలో అత్యంత ఖరీదైన ప్రాంతంగా ఉన్న 'రాజీవ్ గాంధీ నగర్' నేటికీ మురికివాడల లిస్టులో ఉండటం గమనార్హం.. ప్రభుత్వ భూమిలో దాదాపు 20 ఏళ్ళ క్రితమే, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 80 గజాల పట్టాలు పేదలకు మంజూరు చేసింది.. ఈ ఇరవై సంవత్సరాల్లో నిజాంపేట్ సర్కిల్ పరిధి విపరీతంగా అభివృద్ధి చెందినా..! రాజీవ్ గాంధీ నగర్‌ను నేటికీ మురికివాడ(స్లమ్) గానే పరిగణిస్తుంది.. బహుశా పట్టాలు పొందిన పేదలు అధికశాతం అమ్ముకునే ఉంటారు..

## లిఅధికారుల అండ..? నాయకుల ఒత్తిడి..?

అక్రమ నిర్మాణ దారులు ఒకరిని చూసి, మరొకరు అన్నట్టు, అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలు చేపడుతూ.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.. మరోవైపు కొందరు తాజా మాజీ ప్రజాప్రతినిధుల కనుస్నల్లోనే జరుగుతుందనే ఆరోపణలు కూడా లేకపోలేదు.. ఇంతా జరుగుతున్నా నిజాంపేట్ సర్కిల్-58 టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. ఓవైపు మహానగరం విస్తరణలో చిరు వ్యాపారులను సైతం వదిలి పెట్టకుండా నిర్దాక్షిణ్యంగా రోడ్డు ఆక్రమణలు కూల్చేస్తున్న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం.. రాజీవ్ గాంధీ నగర్‌లో ప్రజలను ప్రమాదంలో పెడుతూ, 80 గజాల స్థలంలో ప్రమాదకర బహుళ అంతస్తులు నిర్మించడాన్ని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రోత్సహించడం విశేషం..



రాజీవ్‌గాంధీ నగర్ పేదల నడుమ ధనికుల నిర్మాణాలు..



నిజాంపేట్ సర్కిల్ రాజీవ్ గాంధీ నగర్ పేదల బస్తీలో బహుళ అంతస్తులు..



నిజాంపేట్ సర్కిల్ రాజీవ్ గాంధీ నగర్‌లో.. ఏ అనుమతులు లేవు..

# జాతీయ మెగా లోక్ అదాలత్ విజయానికి కృషి చేసిన పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రాలు

**జగిత్యాల పెన్ పవర్:**
జిల్లాలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ సభ్యులను జిల్లా జడ్జి రత్న పద్మావతి అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. శనివారం నాడు నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లా పరిధిలో మొత్తం 3034 కేసులు పరిష్కారం కావడం జరిగింది. ఈ విజయానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ ప్రతినిధులను ఈ రోజు జిల్లా కోర్టు ప్రాంగణంలో సత్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా జడ్జి రత్న పద్మావతి మాట్లాడుతూ, పోలీస్ అధికారులు, బార్ అసోసియేషన్, కోర్టు సిబ్బంది సమిష్టిగా కృషి చేసి కేసుల్లో ఉన్న కక్షిదారులను స్వయంగా కలిసి "రాజీ మార్గమే రాజమార్గం" అని అవగాహన కల్పించినందువల్లే ఈ స్థాయిలో కేసులు పరిష్కారం కావడం సాధ్యమైందన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, ఇరు వర్గాలకు న్యాయం చేకూరుతుందని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీ స్థాయిలో కేసులు పరిష్కరించడంలో సమన్వయంతో పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తూ, రానున్న రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ , అదనపు జిల్లా జడ్జి నారాయణ, లీగల్ సెల్ సెక్రటరీ వెంకట మల్లిక్ సుబ్రమణ్య శర్మ, మేజిస్ట్రేట్ లు లావణ్య,నికిషా, డిఎస్పి రఘు చందర్, బార్ కౌన్సిల్ జగిత్యాల అధ్యక్షులు, అలాగే జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 'జిఎల్‌సి'లో అక్రమ నిర్మాణాలకు..
# ఎట్టకేలకు నోటీసులు



మల్లంపేట్ 'జిఎల్‌సి'లో ఆక్రమిత సర్కార్ జమీన్‌లో నిర్మాణాలు..

## మై క్యూర్ సిటిజెన్ యాప్‌లో దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసిపి సమాధానం..

- 'జీఎల్‌సి' ఆక్రమిత ప్రభుత్వ భూమిలో.. అక్రమ కట్టడాలపై స్పందించిన ఏసిపి..
- మల్లంపేట్ సర్వే నెం.170/3 పేరుతో ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మాణాలు..?
- లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ బిల్డర్ కొనుగోలు చేసిన భూమి కంటే, అదనంగా కబ్జా..?
- ఆక్రమించిన ప్రభుత్వ భూమిని తెలివిగా తన బినామీల పేరుమీద రిజిస్ట్రేషన్‌లు..
- ప్రభుత్వ భూమిపై రెవెన్యూ..! అక్రమ కట్టడాలపై టౌన్‌ప్లానింగ్ ఉదాసీనత..
- ఈ మధ్యనే 'మైక్యూర్ సిటిజెన్ యాప్‌లో స్థానికుల ఫిర్యాదుకు స్పందన..
- నోటీసులు జారీ చేసినట్లు దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల సమాధానం..




మల్లంపేట్ సర్వే నెంబర్ 170/3 గుర్రం విజయలక్ష్మి వెంచర్ రోడ్డు నెంబర్ 10లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో, పలుకుబడితో అధికారులను మేనేజ్ చేస్తూ, అక్రమార్కులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలకు ఏప్రిల్-8న(నిన్న బుధవారం) నోటీసులు ఇచ్చినట్టు సమాచారం.. స్థానికుల వివరాల ప్రకారం, దుండిగల్ సర్కిల్-59 పరిధిలోని


### 'జిఎల్‌సి'లో అక్రమ కట్టడాలకు నోటీసులు..


మల్లంపేట్ 'జిఎల్‌సి' క్రిబ్స్‌లో అక్రమ నిర్మాణాలపై స్థానికులు పలుమార్లు పలుచోట్ల సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా..! దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసు ఎట్టకేలకు స్పందించారు.. "మై క్యూర్ సిటిజెన్ యాప్‌లో" సంబంధిత అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీచేసినట్టు తెలియజేసినట్టు ఫిర్యాదు దారులు 'పెన్ పవర్' పత్రికతో తెలిపారు.. ఇప్పటికైనా దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించినందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

**దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 8:** పలుకుబడే ప్రయోగించారో..! ప్రభుత్వ భూమికి కబ్జాదారుల నుండి కప్పం కట్టించుకున్నారో తెలియదు కానీ..! రెవెన్యూ-మున్సిపల్ అధికార యంత్రాంగం పనితీరుతో వందల కోట్లు విలువైన ప్రభుత్వ భూమి కనుమరుగయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తుంది.. మల్లంపేట్ సర్వే నెంబర్ 170/3, 170/4, 170/5 ఈ మూడు సబ్ డివిజన్‌లకు చెందిన భూమిని సుమారు 15-00 ఎకరాలు, బిల్డర్ విజయలక్ష్మి కొనుగోలు చేసింది.. ఈ వ్యవహారంలో పలు ఫిర్యాదులు, ఆరోపణలతో 2021 లోనే, అప్పటి మేడ్చల్ జిల్లా కలెక్టర్ విచారణ జరిపి 'జిఎల్‌సి' వెంచర్‌లో సంచలన అక్రమాలు బట్టబయలు చేసి, బిల్డర్‌పై కేసులు నమోదు చేశారు.. బిల్డర్ విజయలక్ష్మి "అనుమతులతో 60 విల్లాలు- అక్రమంగా 260 విల్లాలు నిర్మించారని నిర్ధారించారు.. యుద్ధ ప్రాతిపదికన విల్లాలు మొత్తం సీజ్ చేశారు.. 2022 అక్టోబర్ 3న దసరా పండుగ రోజే, 208 విల్లాలకు మౌలిక వసతులు కల్పించకుండా, నిషేధిత జాబితాలో పెట్టినట్టు అప్పటి దుండిగల్ కమిషనర్ సంబంధిత వివిధ శాఖలకు నోటీసులు అందజేశారు.. మనది ప్రజాస్వామ్య ప్రభుత్వం అయినందున, ప్రజలకంటే ఇలాంటి కబ్జాదారులకే ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారని ఆనాడే తెలిసింది.. ఆతర్వాత యధావిధిగా విల్లాలు పూర్తిచేసినా పట్టించుకున్న అధికారి కనిపించలేదు.. దాదాపు రూ.400 కోట్ల కుంభకోణం జరిగిన వెంచర్‌లో ఇంకా కబ్జాల పర్వాన్ని అధికారులు కట్టడిచేయలేక పోవడం గమనార్హం.. నియోజకవర్గంలో ఓ ముఖ్య నాయకునితో రూ.కోట్ల ఒప్పందం కుదుర్చుకుని 'జిఎల్‌సి' ఆక్రమిత ప్రభుత్వ భూమికి స్కెచ్ వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు..




మల్లంపేట్ 'జిఎల్‌సి'లో దుండిగల్ టౌన్‌ప్లానింగ్ నోటీసులు ఇచ్చిన నిర్మాణాలు..




మై క్యూర్ సిటిజెన్ యాప్‌లో ఏసిపి శ్రీనివాస్ సమాధానం..

# ఫాగింగ్ లేకపాయే దోమలు పెరిగిపోయే





**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 8:** మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో ఉన్న కాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు మొలిచి మురుగు కాలువల్లో నిలిచిన చెత్తాచెదారంతో నీరు నిలువ ఉండటంతో దోమలు ఆవాసాలుగా చేసు కొని సంతతి పెరగటానికి కారణమై పగలు రాత్రి తేడా లేకుండా దోమల విజృంభనతో కంటిమీద కునుకు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు దోమల స్వైర విహారంతో ఆరుబయట సైతం నిల్చోలేని పరిస్థితి నెలకొందని దోమల నివారణకు కనీసం కాలువలలో బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని ప్రజా ప్రతినిధులు ఉన్నతా ధికారులు గ్రామంలో పర్యటించినప్పుడు మాత్రమే బ్లీచింగ్ పౌడర్ చల్లించి పంచాయతీ అధికారులు చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారుతుందని దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగి ప్రతిఏటా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన ప్రాణాలు కోల్పోతున్నప్పటికి వాటిని నివారించేందుకు గ్రామపంచాయతీ అధికారులు చేస్తున్న కృషి అంతంత మాత్రంగానే ఉందని ఆరోపి స్తున్నారు పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా దోమల్నిఅరికట్టేందుకు గ్రామ పంచాయతీ కీ ఫాగింగ్ యంత్రం ఉన్నప్పటికీ ఫాగింగ్ యంత్రంతో దోమల మందు పిచికారి చేయడం లేదని ప్రజల ఆరో గ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని వాపోతున్నారు ఫ్రైడే డ్రైడే ద్వారా దోమల నియంత్రణ చర్యలను చేపట్టాల్సి ఉండగా



మొక్కుబడిగా చేపడుతూ ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని. మండిపడుతున్నారు ఇప్పటికైనా స్థానిక సర్పంచ్ పంచాయతీ అధికారులు స్పందించి దోమల నివారణకు వార్డులలో ఫాగింగ్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# మైలేజ్ కన్నా... డ్యామేజ్ ఎక్కువ..!

**హైదరాబాద్, ఏప్రిల్ 8, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీరు తీవ్ర దుమారం రేపుతోంది. తాజాగా అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సైతం కౌశిక్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాడిన పదజాలం విన్నవారికి ఇప్పటికే ఓ క్లారిటీ వచ్చేసింది. త్వరలో కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వంపై వేటు లేదా కఠిన చర్యలు తప్పవనే సంకేతాలు చెప్పకనే చెప్పేశారు సీఎం. అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డిపై అసెంబ్లీలో నిప్పులుచెరిగిన విధానం, ఏకంగా ఓ ఎమ్మెల్యే అసెంబ్లీ నక్సలైట్‌గా కౌశిక్ రెడ్డిని పోల్చిన తీరు పెను సంచలనంగా మారింది. ఓ ఎమ్మెల్యేపై అసెంబ్లీలో ఇంత రచ్చ అవసరమా అని కొందరు అనుకోవచ్చు, కానీ కౌశిక్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా 2021లో హుజూరాబాద్ ఉపఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి ఆయన దూకుడు మాములుగా లేదంటున్నారు రాజకీయ విమర్శకులు. తాజాగా సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లడుతుండగా తుపాకీతో కాల్చిపడేస్తానంటూ అసెంబ్లీలో సైగలు చేసి, అవమానించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎథిక్స్ కమిటీని సైతం ఏర్పాటు చేసి వేటుకు రంగం సిద్ధం చేశారు. కౌశిక్ రెడ్డిని వివాదాలు వెంటాడతాయో లేక తానే వివాదాలను ముద్దాడుతాడో తెలియదు కానీ, ఎక్కడుంటే అక్కడ పొలిటిక్ రచ్చ సర్వసాధారణంగా మారింది. 2024లో హైదరాబాద్‌లో విధినిర్వహణలో ఉన్న ఓ ఎస్ఐపై అనుచితంగా ప్రవర్తించాడని, విధులకు ఆటంకం కలిగించాడని కౌశిక్ రెడ్డిపై అప్పట్లో కేసు నమోదైంది. హైదరాబాద్ కౌశిక్ నివాసం చుట్టూ భారీగా పోలీసులు మోహరించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ వివాదానికి ముందు తన భార్య శాలినీ పుట్టినరోజు సందర్భంగా యాదాద్రి గుడిలో ఫొటో షూట్ నిర్వహించి, సోషల్ మీడియాలో వీడియోలో పోస్ట్ చేయడంపై కౌశిక్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. 2025లో కరీంనగర్ కలక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మాట్లడుతుండగా, నువ్వు ఏ పార్టీ ఎమ్మెల్యేవి చెప్పంటూ కౌశిక్ రెడ్డి మధ్యలో జోక్యం చేసుకోవడం, సంజయ్‌తో బాహాబాహీకి దిగడం వివాదంగా మారింది. తనపైన కౌశిక్ రెడ్డి దాడి చేశాడంటూ ఎమ్మెల్యే సంజయ్ ఇచ్చిన ఫిర్యాదుతో సెక్షన్ 126,115, 352, 292ల కింద కేసు నమోదు చేసిన కరీంనగర్ పోలీసులు, హైదరాబాద్ వచ్చి కౌశిక్ రెడ్డిని బలవంతంగా అరెస్ట్ చేసి కరీంనగర్ స్టేషన్ కు తరలించారు. ఓ గ్రానేట్ సంస్థ యజమానిని బెదిరించి 50లక్షలు డబ్బు డిమాండ్ చేశారనే ఆరోపణలపై జూన్ 1, 2025లో శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి విదేశాలకు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేసి, ఎక్స్ టార్షన్ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. అంతకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చీరా, గాజులు చూపిస్తూ కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఇటీవల సమక్క సారక్క జాతర జరుగుతున్న సమయంలో వీణవంక మండలంలోని సమ్మక్క జాతరకు కుటుంబ సమేతంగా వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన హంగామా అంతా ఇంతా కాదు, విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారిని మతం పేరుతో దూషించాడంటూ పెను దుమారం రేగింది. అదే రోజు బలవంతంగా కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకోవడం, రోజంతా హైడ్రామా కొనసాగింది. ఆవేశంలో మాట్లడాను , కావాలని మతం పేరుతో పోలీసు అధికారిని దూషించలేదంటూ క్షమాపణలు కోరుతూ మరుసటి రోజు వీడియో విడుదల చేయడంతో వివాదం కాస్తా తాక్కాలికంగా సర్దుమణిగింది. ఇలా ఒకటేమిటి హుజూరాబాద్ గడచిన ఎన్నికల సమయంలో కౌశిక్ రెడ్డి ఓట్లు అభ్యర్థించిన తీరు, కుటుంబ సమేతంగా విడుదల చేసిన వీడియోలు రాజకీయంగా వివాదాలను తెచ్చిపెట్టాయి. బీఆర్ ఎస్ నుంచి కాంగ్రెస్‌కు పార్టీ మారిన ఎమ్మెల్యేలు అరెకెపూడి గాంధీ, దానం నాగేందర్‌పై కౌశిక్ చేసిన వ్యాఖ్యలపై అంతే స్థాయిలో వాళ్లు స్పందించిన విధానం తిరిగి కౌశిక్ మెడకు చుట్టుకున్నాయి. కండలు తిరిగిన శరీరాకృతితో కనిపించే కౌశిక్ రెడ్డి, హావభావాలు, మాట్లాడే విధానం, ఎదుటి వ్యక్తులతో దురుసుగా ప్రవర్తించిన తీరుతో అధికార కాంగ్రెస్ పార్టీ విసిగిపోయింది.

అదును చూసి దెబ్బకొట్టింది. అసెంబ్లీ నుంచి సాగనంపేందుకు సిద్ధమైంది. అయితే బీఆర్ఎస్ మాత్రం తమ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దూకుడుతో పార్టీకి డ్యామేజ్ జరుగుతుందో, మైలేజ్ వస్తుందో, అర్థం కాని అయోమయంలో కనిపిస్తోంది. సమర్థిస్తే పరువు పోతుంది. వెనుకేసుకొస్తే జనం నవ్వుతారేమో అనే దీర్ఘాలోచనలో ఉన్నట్లు కనిపిస్తోంది. కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరి, ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత జరిగిన వరుస ఘటనల వల్ల పార్టీకి లాభం కంటే, నష్టమే ఎక్కువ. దూకుడు తప్పుకాదు, ఆవేశం తప్పుకాదు, కానీ ఎక్కడ వాడాలో తెలియకపోవడం అతిపెద్ద ముప్పు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విషయంలో అదే జరుగుతోందంటున్నారు రాజకీయ విశ్లేకులు. విమర్శించడం, దాడి చేయడం, అరెస్ట్ అవ్వడం, నోరు జారడం, క్షమాపణలు చెప్పడం.. ఇలా కౌశిక్ రెడ్డికి గత కొంతకాలంగా అలవాటైపోయింది. ఈసారి అసెంబ్లీలో కడియంపై సైగలు చేసి అడ్డంగా దొరికేశాడంటున్న అధికార పార్టీ, భవిష్యత్‌లో మరెవరూ ఇలా మాట్లాడకుండా చేస్తామంటూ చెప్పిమరీ వేటు వేసేందుకు సిద్ధమైంది.

# ధాన్యంతో అన్నదాల నిరీక్షణ

**నిజామాబాద్, ఏప్రిల్ 8, పెన్ పవర్:**
మార్చి మూడో వారం నుంచే వరి కోతలు ప్రారంభమై ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలిస్తున్నప్పటికీ కొనుగోళ్లు జరగకపోవడంతో నిల్వ సమస్యలు తీవ్రంగా మారాయి. పదిహేను రోజులుగా రైతులు ధాన్యాన్ని కుప్పలుగా వేసి కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నా, ఇప్పటివరకు ఒక్క క్వింటాల్ కూడా అధికారికంగా కొనుగోలు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏర్పాటు చేయాల్సిన 22 ఐకేపీ, 5 పిఎసిఎస్, 3 మెప్మా కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. గతంలో కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లోనే రైతులు ధాన్యం రాశులు పోసి వేచి చూస్తున్నారు. ధాన్యం పండించి కోత కోసిన అన్నదాతలకు నిరీక్షణ తప్పడం లేదు. మండలంలోని పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు మొదలయ్యాయి. వరి కోతలు మొదలై చేతికొచ్చిన పంటను కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ఆరబోసుకున్నారు. ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం అన్నదాతలను ఒకింత ఆందోళనకు గురి చేస్తుంది. మండలంలో దాదాపు 25 శాతం వరి పొలాలు కోతలుపూర్తయ్యాయి. అయినా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇప్పటి వరకు మంగపేట మండలంలో ఎక్కడా కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఊసే లేదు. దీనికి తోడు గత నాలుగు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులకు అన్నదాతలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, వర్షాలు పడే అవకాశాలు కనబడుతుండడంతో కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతాంగం కోరుతుంది పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు రోజుల నుండి ఆకాశం మబ్బుగా ఉంది. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి. వర్షం వస్తే కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిచిపోయే అవకాశం ఉంది. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. మండలంలో ఒకటి, రెండు చోట్ల లాంఛనంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పత్రికలకు ప్రకటనలు ఇవ్వడమే తప్ప మండలంలో ఇప్పటి వరకు ఎక్కడా ఒక్క బస్తా వడ్లను కూడా కొనలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

**కలవరపడుతున్న రైతులు..**
ఎండల కారణంగా తేమ శాతం అనుకూలంగా ఉన్నప్పటికీ, అకాల వర్షాల భయం రైతులను కలవరపెడుతోంది. ఇతర ప్రాంతాల్లో వారం రోజుల క్రితమే ధాన్యం కేంద్రాలకు రాక ప్రారంభమైనప్పటికీ, కొనుగోళ్లు ఎక్కడా
ప్రారంభం కాలేదని రైతులు చెబుతున్నారు. ధాన్యం కుప్పలుగా పేరుకుపోవడంతో వాటి రక్షణ కూడా సమస్యగా మారింది. ప్రస్తుత పరిస్థితుల
ప్రకారం పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టే అవకాశముందని తెలుస్తోంది. ఇదే సమయంలో అకాల వర్షాలు, వడగండ్ల వానల ముప్పు ఉండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తమను మండల రైతులు
కోరుతున్నారు. వడ్లను గతంలో ధాన్యం కొనుగోలు చేసిన చోటుకు తీసుకువచ్చి 10 రోజులు అవుతోంది. కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియట్లేదు. ఇప్పటి వరకు ఇక్కడ ఈ విధమైన ఏర్పాట్లు చేయలేదు ఈడపరిస్థితి చూస్తుంటే ఇంకా సమయం పట్టేటట్టు ఉంది.

## తుమ్మూరు చెరువులో చేపల వేట

**పినపాక, ఏప్రిల్, 8 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం తుమ్మూరు చెరువులో బుధవారం భారీ స్థాయిలో చేపల వేట జరిగింది. సుమారు 50 టన్నుల చేపలను పట్టాలనే లక్ష్యంతో సొసైటీ సభ్యులు ఆంధ్రప్రదేశ్ నుంచి చేపలు పట్టే వారిని రప్పించారు. చేపల తరలింపునకు భారీ క్రేన్, రెండు కంటైనర్లు, ఐషర్ వాహనాలను ఉపయోగించారు. చేపలు పడుతున్నారన్న సమాచారంతో తుమ్మూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకున్నారు.

## గూడూరు లో ఏసిబి కి చిక్కిన ఏంఇఓ

**మహబూబాబాద్, ఏప్రిల్, 8 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల విద్యాధికారి రవీందర్, అయోధ్య పురం జిల్లా పరిషత్ హై స్కూల్ స్కూల్ అసిస్టెంట్ చంద్రమౌళిలు రూ. 15,000 లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గుండెంగ గ్రామ శివారు వాగ్య తండా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రవీందర్ పదవీ విరమణ ఫైళ్లపై సంతకాల కోసం నెల రోజులపాటు రూ. 15,000 లంచం అడిగి వేధించినట్లు బాధితుడు తెలిపారు. జిల్లా పరిషత్ హై స్కూల్ అయోధ్య పురం హెడ్మాస్టర్ గూడూరు మండల విద్యాధికారిగా ఇంచార్జ్ గా వ్యవహరిస్తున్నారు.

## గోపాల్ పూర్ లో రోడ్డు ఆక్రమణల తొలగింపు




**వరంగల్ వెస్ట్, ఏప్రిల్, 8 పెన్ పవర్:** హన్మకొండలోని గోపాల్‌పూర్, దేవరాజ్ కాలనీ, శివ సాయి కాలనీలలో రోడ్లను ఆక్రమించి నిర్మించిన వినాయక మండపాలను మున్సిపల్ అధికారులు జేసీబీతో తొలగించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. కాజీపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణలను తొలగించారు. రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు తప్పవని ఇన్చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రశాంత్ హెచ్చరించారు.

## పరిశుభ్రతపై కౌన్సిలర్ బెజ్జల శ్యామల పిలుపు:

**భూపాలపల్లి, ఏప్రిల్, 8 పెన్ పవర్:** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు జవహర్ నగర్ కాలనీలో బుధవారం వార్డు కౌన్సిలర్ బెజ్జల శ్యామల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో కలిసి సైడ్ కాలువలను శుభ్రం చేయించారు. కాలనీవాసుల ఆరోగ్యం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కౌన్సిలర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ తరఫున ఆర్థిక సహాయం

**ములుగు, ఏప్రిల్, 8 పెన్ పవర్:** అనారోగ్య సమస్యలతో మరణించిన భూపాలపల్లి హోంగార్డు రంజిత్ కుటుంబానికి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మనోధైర్యం నింపారు. రంజిత్ మృతదేహానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ, మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం శిబిరం

**సంగారెడ్డి, ఏప్రిల్, 8( పెన్ పవర్:**సంగారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం సదరం శిబిరం జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి దివ్యాంగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రిజిస్ట్రేషన్ అనంతరం వైద్యులు వారిని పరీక్షించారు. అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని ఆసుపత్రి సూపరింటెండ్ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ శిబిరం దివ్యాంగులకు సహాయం అందించే లక్ష్యంతో నిర్వహించబడింది.

## పూజ గదిలో ప్రత్యక్షమైన నాగుపాము

**నారాయణఖేడ్, ఏప్రిల్, 8 పెన్ పవర్:** పూజ గదిలో పాము ప్రత్యక్షమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల కేంద్రానికి చెందిన మహేందర్ ఇంట్లోని పూజ గదిలో నాగుపాము కనిపించింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న స్థానికులు భయాందోళనకు గురవుతూనే పాలను సమర్పించి భక్తితో మొక్కారు. అనంతరం స్నేక్ క్యాచర్ పామును పట్టుకుని నిర్మానుష్య ప్రాంతంలో వదిలాడు. ఈ వీడియో వైరల్ అవుతోంది.

## సంగారెడ్డి రహదారిపై ప్రయాణికులకు నరకం: అధికారులు స్పందించాలని డిమాండ్

**జహీరాబాద్, ఏప్రిల్, 8 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లాలో మయికోడ్ నుండి బోరంచ వెళ్లే ప్రధాన రహదారి ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. సుమారు 30 గ్రామాల ప్రజలకు కీలకమైన ఈ దారిలో ఒకవైపు లోతైన బావి, మరోవైపు ప్రమాదకరమైన కాలువ ఉండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతంలో బావిలో పడి ఒకరు మృతి చెందిన ఘటనలున్నా, అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది మంది విద్యార్థులు, రైతులు ఈ దారిలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఎదురుగా వాహనం వస్తే తప్పుకోవడానికి కూడా చోటు లేక వాహనదారులు వణికిపోతున్నారు. అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పెట్టుబడులు రావొద్దనేదే బీఆర్ఎస్ ఉద్దేశం

- 3 పేజి తరువాయి

ఇండస్ట్రియల్ పార్కుల్లో కొత్త యూనిట్లకు కేటాయించేందుకు భూములు అందుబాటులో లేవని.. కొన్ని చోట్ల ఉన్నా న్యాయపరమైన వివాదాలు, యాక్సెస్ రోడ్డు అందుబాటులో లేదని తెలిపారు. ఇలాంటి తరుణంలోనే కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ల్యాండ్ బ్యాంక్‌ను అందుబాటులోకి తేవాలని నిర్ణయించామని వివరించారు. పారిశ్రామికాభివృద్ధిని అన్ని ప్రాంతాలకు విస్తరించాలనే లక్ష్యంతో అన్ని రంగాల్లో వెనుకబడిన వికారాబాద్ జిల్లా పరిధిలోని కొడంగల్, పరిగి తదితర ప్రాంతాలను ఎంపిక చేశామని.. కొడంగల్, కోస్గి, దోమ, పరిగి తదితర ప్రాంతాల కనెక్టివిటీని పెంచేందుకు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు రేడియల్ రోడ్డు, ఆర్ఆర్ఆర్‌ను ప్రతిపాదించామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో అవసరమైన మేరకు మాత్రమే భూసేకరణ చేయబోతున్నామని మంత్రి తెలిపారు. భూ సేకరణ చట్టం 2013 ప్రకారం డీపీఆర్‌ను తయారు చేసి, ప్రభుత్వం నుంచి 10ఏ జీవో తీసుకున్న తర్వాతే పరిగి మండల పరిధిలోని రాపోల్, కాడ్లాపూర్‌లో భూసేకరణకు నోటిఫికేషన్‌ను జారీ చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్‌ను టీజీఐఐసీ కోరిందని మంత్రి స్పష్టం చేశారు. భూముల్ని కోల్పోయిన వారికిచ్చే నష్ట పరిహారం విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. చట్టప్రకారం నష్ట పరిహారం, ఆర్అండ్ఆర్ బెనిఫిట్ కింద ఇళ్ల స్థలాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవడమే ఎజెండాగా సాగుతున్న బీఆర్ఎస్ కుట్రలో భాగస్వామ్యం కావొద్దని అక్కడి ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

## కొత్త ఎస్ఐ నరేష్ బాధ్యతలు స్వీకరణ:
# శాంతిభద్రతలకు ప్రాధాన్యం




**ఆసిఫాబాద్, ఏప్రిల్, 8 పెన్ పవర్:** కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్గాం పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా నరేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు సత్వర న్యాయం, పారదర్శక సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు. నేరాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, స్థానికులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈస్గాం ఎస్ఐగా నరేష్ బాధ్యతల స్వీకారం గురువారం జరిగింది.

## కలెక్టర్ హరిత ఆకస్మిక తనిఖీలు:
## అధికారులకు సూచనలు

**సిర్పూర్, ఏప్రిల్, 8 పెన్ పవర్:** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూరు మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ హరిత తహసిల్దార్ కార్యాలయం, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, సీహెచ్సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల్లో సేవల అమలు, పాఠశాలలో విద్యా పరిస్థితులు, ఆసుపత్రిలో వైద్య సదుపాయాలను పరిశీలించి, లోపాలపై అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలు 2026 ఏప్రిల్ 8న జరిగాయి.

### ఉపాధి హామీ పనులను ప్రారంభించిన ఉప సర్పంచ్ విట్టల్

**మంచిర్యాల, ఏప్రిల్, 8 పెన్ పవర్:** కొమురం భీం జిల్లా వాంకిడి మండల్ జంబూల్ ధరి పంచాయతీలోని లంజనివీర గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ఉప సర్పంచ్ గురునులే విట్టల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం కీలకమని, దీని ద్వారా గ్రామీణులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. పనులు నాణ్యతతో, పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

### భూమి వివాదంలో తండ్రీకొడుకులకు జీవిత ఖైదు !

**బెల్లంపల్లి, ఏప్రిల్, 8 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో ఎకరం భూమి వివాదంలో వనోలే ఈశ్వరరావును హత్య చేసిన కేసులో తండ్రీకొడుకులు వనోలే సూర్యకాంత్, వనోలే పాండురంగలకు ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు జీవిత ఖైదు విధించారు. ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున రూ.2 వేల జరిమానా కూడా విధించారు. 26 డిసెంబర్ 2023న జరిగిన ఈ హత్య కేసులో, బాధితుడి భార్య వనోలే కవిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. పీపీ రహీమ్ సమర్థవంతంగా వాదించి నేరాన్ని రుజువు చేశారు.

# ఈవీఎం గోదాము తనిఖీ



**జగిత్యాల, ఏప్రిల్, 8 పెన్ పవర్:** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు, బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దరూర్ క్యాంప్ లో ఈవీఎం లను భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా, కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి నెలా ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని, గోడౌన్ లోని యంత్రాల భద్రత, సీసీ కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించినట్లు తెలిపారు.

## అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన:
## చిన్నారుల సమగ్ర వికాసానికి శ్రీకారం

**కోరుట్ల, ఏప్రిల్, 8 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా, కోరుట్ల, మల్లాపూర్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో 2026 ఏప్రిల్ 8న చిన్నారుల సమగ్ర వికాసం కోసం "అక్షరాభ్యాసం" (3-6 ఏళ్లు) మరియు "అన్నప్రాసన" (6 నెలలు) కార్యక్రమాలు గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశం చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం మరియు సరైన పోషకాహారాన్ని అందించడం అని సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకురాలు ఎం. రాధ, ఉప సర్పంచ్ సోమ రెడ్డి, వార్డు సభ్యులు, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త దాంరాజ్ పల్లిలో హిందూ సమ్మేళనం:
## ఐక్యత, ధర్మ రక్షణకు పిలుపు

**ధర్మపురి, ఏప్రిల్, 8 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా, కోరుట్ల, మల్లాపూర్ మండలం కొత్త దాంరాజ్ పల్లిలో ఈ నెల 11వ తేదీ శనివారం సాయంత్రం 5:30 గంటలకు ఉమామహేశ్వర ఆలయంలో హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందూ సమాజ ఐక్యత, ధర్మ రక్షణ లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. గ్రామ సర్పంచ్, గ్రామస్తులు, నిర్వాహకులు అందరినీ ఆహ్వానించారు. ఈ సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అన్నప్రాసద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

### వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**రామగుండం, ఏప్రిల్, 8 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా, రామగుండం కార్పొరేషన్ 48వ డివిజన్ కెసీఆర్ కాలనీకి చెందిన రాగుల ఆదర్శ్ కు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.23 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును డివిజన్ కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి బుధవారం అందజేశారు. నిరుపేదల వైద్య భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆపదలో అండగా నిలుస్తున్న సీఎంఆర్ఎఫ్ పేదలకు కొండంత ఆసరా అని ఆమె పేర్కొన్నారు. బాధితుడు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఘనంగా రామయ్య నిత్య కళ్యాణం

**భద్రాచలం, ఏప్రిల్, 8 పెన్ పవర్:** భద్రాచలంలో బుధవారం శ్రీరామచంద్రుని నిత్య కళ్యాణోత్సవం అర్చకులచే శాస్త్రోక్తంగా బేడా మండపంలో నిర్వహించబడింది. ఈ వేడుకలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిత్య కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తిపారవశ్యంతో నిండిపోయింది.

### మరో 2 రోజుల పాటు వర్షాలు

**కొత్తగూడెం, ఏప్రిల్, 8 పెన్ పవర్:** రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎఓఆ వెల్లడించింది. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, వరంగల్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కుస్తాయని తెలిపింది. ఆ తర్వాత మళ్లీ ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పెరగొచ్చని చెప్పింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# భద్రప్ప జాతర ఉత్సవాలు ప్రారంభం

**తాండూరు, ఏప్రిల్, 8 పెన్ పవర్:** తాండూరులో శ్రీ భావిగి భద్రేశ్వర జాతర ఉత్సవాలు రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. భద్రేశ్వరుని విగ్రహాన్ని చిన్న రథంపై ఊరేగించారు. భక్తుల భజనలు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య చిన్న రథం ఊరేగింపు ఘనంగా సాగింది. రాత్రి 11 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ప్రారంభ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ నెల 11న రథోత్సవం, 12న లంకా దహనం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మేడి మహేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పోరాట యోధుడు నర్రా రాఘవరెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆయన కష్టజీవుల రాజ్యస్థాపనకు అహర్నిశలు పోరాడిన ఒక రాజీలేని పోరాట యోధుడు. అలుపెరుగని కమ్యూనిస్టు ధీరుడు. కమ్యూనిస్టు ప్రమాణాలను ప్రాణంగా భావించిన ఆదర్శమూర్తి. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా జీవించిన ప్రజల మనిషి. అణగారిన వర్గాల పక్షపాతిగా, కష్ట జీవుల రాజ్య స్థాపనకు అహర్నిశలు పోరాడిన నేత. ఆరు సార్లు చట్టసభకు ఎన్నికైన మచ్చలేని ప్రజాప్రతినిధి. కమ్యూనిస్టుగా రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆ ఆదర్శ నేతనే నర్రా రాఘవరెడ్డి. నర్రా రాఘవరెడ్డి ప్రజాజీవితం అత్యంత పారదర్శకం. ఆయన అతి సాధారణ జీవితం రాజకీయ నేతలకు ఆదర్శం. నర్రా రాఘవరెడ్డి ఆదర్శ కమ్యూ నిస్టు, కడు బీదరికంలో పుట్టి, అంతంత మాత్రం చదువుతో జీవ నం కోసం వలసవెళ్లి మిల్లు కార్మికునిగా జీవితం ఆరంభించిన రాఘవరెడ్డి, కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా, కార్యకర్తగా, నేతగా ఎదిగారు. నిరంతరం ప్రజల మధ్య మసలుతూ, వారి సమస్యలను ఆకళింపు చేసుకొని, ఆ అధికా రులు పాలకుల వద్దకు నిర్భయంగా తీసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తుండే చిత్తశుద్ధి కలిగిన రాజకీయ నాయకుడు. సిపిఎం శాసనసభా పక్ష నేతగా పనిచేసిన నర్రా రాఘవరెడ్డి నాల్గవ తరగతి వరకు మాత్రమే విద్యా భ్యాసం చేసినా, బాల్యం నుండే విప్లవ భావజాలాన్ని ఒంటబట్టించు కున్నారు. 1945 ప్రాంతంలో మజ్దూర్ యూనియన్ కమ్యూ నిస్టులో చేరిన నర్రా ఇల్లు విడిచి ముంబయికి వెళ్లి అక్కడ కూలీగా పనిచేస్తు కార్మిక హక్కుల కోసం పోరాడి కార్మిక నేతగా గుర్తింపు సాధించారు. తల్లి మరణంతో తిరిగి ఏనిమిదేళ్లకు స్వగ్రామానికి చేరుకున్న నర్రా 1950లో సిపిఐ పార్టీ సభ్యుడిగా చేరారు. కళాకారుడిగా, జానపద సంభాషణలు, చతురోక్తులు, సామెతలు, పిట్టకథలతో అనర్గళంగా మాట్లాడే నర్రా మాటలకు గ్రామీణులు ఆకర్షితులై ఆయనను అనుసరించారు. 1950లో సిపిఐ జిల్లా కార్యాలయ కార్యదర్శిగా పనిచేసిన నర్రా 1959లో వచ్చిన పంచాయతీ ఎన్నికల్లో చిట్యాల మండలం శివనేనిగూడెం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1964 ఎన్నికల్లో తిరిగి సర్పంచ్‌గా గెలిచిన నర్రా మరోసారి జడ్పీలో ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 1967లో జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా నకిరేకల్ శాసన సభ నుండి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేసిన నర్రా రాఘవరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి ఎం.కమలమ్మపై గెలిచి తొలిసారి శాసన సభలో అడుగుపెట్టారు. 1972లో జరిగిన ఎన్నికల్లో నకిరేకల్ స్థానం నుండి పోటీచేసిన నర్రా కాంగ్రెస్ అభ్యర్థి ఎం.కమలమ్మ చేతిలో ఓటమి పాలయి, 1978, 1983, 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా ఐదు సార్లు నకిరేకల్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నర్రా రాఘవరెడ్డి 1924 సంవత్స రంలో చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా కమలమ్మ - రాంరెడ్డిలకు దంపతు లకు జన్మించారు. చిరు ప్రాయం లోనే తల్లి కమలమ్మ మరణించడం, తండ్రి పెంపకానికి దూరమై, పెద నాయన నర్రా వెంకటరామిరెడ్డి వద్ద పెరగడం, వెంకట రామిరెడ్డి చనిపోయాక మళ్లీ కన్న తండ్రి రాంరెడ్డి దగ్గరే ఉండాల్సి రావడం, పరిస్థితుల ప్రభావం వల్ల బతుకు దెరువునెతుకుంటూ ఊరొదిలి బొంబాయికి వలస వెళ్లారు. బొంబాయిలో అనేక ఇబ్బందులు ఎదుర్కొని, బట్టల మిల్లులో కార్మికుడుగా చేరారు. కార్మికులకు కనీస హక్కులేని కాలమది. కంపెనీ యాజమాన్యం కార్మికుల కష్టాలు ఆలకించని పరిస్థితులుండేవి. కార్మికుల బాధలు తీర్చడానికి కమ్యూనిస్టు పార్టీకి అనుబంధంగా 'లాల్‌బావుటా' బలమైన కార్మిక సంఘంగా పనిచేసేది. అందులో సభ్యుడుగా చేరిన నర్రా చురుకైన పాత్ర పోషించారు. కంపెనీలు మూతపడడం... 8 ఏళ్ల తర్వాత నర్రా తిరిగి సొంత ఊరొచ్చారు. బొంబాయిలో లాల్‌బావుటాలో పనిచేస్తున్న రోజుల్లోనే కమ్యూనిస్టు సిద్ధాంత పరిజ్ఞానాన్ని జీర్ణించుకున్న నర్రా జిల్లాకు వచ్చాక కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. 1949లో వట్టిమర్తి గ్రామంలో యువజన సంఘం స్థాపించి అధ్యక్షులుగా పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీ కొరియర్‌గా పనిచేశారు. 1950లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొంది గ్రామ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత తాలూకా కమిటీ సభ్యునిగా ఎన్నికై ప్రజల, కార్యకర్తలతో సత్సంబంధాలు ఏర్పరుచుకున్నారు. జిల్లాకు వచ్చాక గ్రామాల్లో క్షేత్ర స్థాయి కార్యకర్తగా పనిచేశారు. క్రమశిక్షణ, పట్టుదల, కార్యదక్షత కలిగిన నర్రా సిపిఎంలో అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. సర్పంచ్ మొదలుకుని శాసన సభసభ్యుని వరకు అనేక పర్యాయాలు గెలుపొంది ప్రజల వాణిని చట్ట సభల్లో వినిపించారు. ప్రజా ఉద్యమ నిర్మాతగా, ప్రజా ప్రతినిధిగా, పాలక వర్గాలకు జంకు పుట్టించారు. శాసనాల రూపకల్పన, వాటి అమలులో జరుగుతోన్న తప్పిదాలను ఎత్తిచూపుతూ ప్రభుత్వ ప్రతినిధులు, అధికారు లకు దిశా దశ నిర్దేశించిన సందర్భాలనేకం ఉన్నాయి. నర్రా రాఘవరెడ్డి యాభై ఏళ్ల ప్రజా జీవితంలో ప్రజలకు బహుముఖ సేవల్ని అందించారు. 1950 నుంచి సిపిఐ పార్టీ సభ్యునిగా కార్యకర్తగా, కళాకారుడుగా సుపరిచితుడే. అంతరంగిక సమస్యలతో పాటు సైద్ధాంతిక విభేదాలతో కమ్యూనిస్టు పార్టీ చీలిన తర్వాత సిపిఎం విధానాలను ముందుకు తీసుకు పోవాలని నర్రా పార్టీలో క్రియా శీలకంగా పనిచేశారు. మళ్లీ 1968లో మొదలైన ఉగ్రవాద చీలికను సైతం ఎదుర్కోవడంలో నర్రా ఎంతో కృషి చేశారు. ఉగ్రవాదం వైపు వెళ్లిన కార్యకర్తల్ని మళ్లీ పార్టీలోకి చేర్చుకునేందుకు ప్రయత్నించారు. ఈ ప్రభావంతోనే 1972లో పార్టీ ఓటమి పాలైనా నిరాశకు గురికాలేదు. 1973లో బీబీనగర్-నడికుడి రైలు మార్గం విస్తరణకు కృషి చేశారు. ఎమర్జెన్సీ తర్వాత ఎమ్మెల్యేగా 1977లో గెలుపొందిన నర్రా శాసన సభలో ప్రజల, పార్టీ వాణిని వినిపించారు. సిపిఎం శాసన సభా పక్ష నేతగా, ఉప నేతగా పలు పర్యాయాలు పనిచేశారు. టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాల పనితీరుపై అనేక విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్ర అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రాజెక్టుల, పథకాల రూపకల్పనలో ప్రభుత్వానికి నర్రా పలు సలహాలు, సూచనలు చేసి ప్రజా సంక్షేమానికి పాటుబడ్డారు. పార్టీ నిర్మాణంలో కృషి చేస్తునే శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సాధన కోసం అనేక పోరాటాలు చేశారు. ప్రజా ప్రతినిధిగా పార్టీ నాయకునిగా పనిచేయడంతో

పాటు ప్రజా సంఘాల నిర్మాణానికి పాటు పట్టారు. గీత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా నర్రా ఎన్నికై ఎక్సైజ్ విధానానికి, కాంట్రాక్టు పద్ధతికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసి గుర్తింపు తెచ్చారు. గ్రామ సేవకుల సంఘాన్ని జిల్లాలో ఏర్పాటు చేసి రాష్ట్ర ఉద్యమంగా తీర్చిదిద్దడంలో నర్రా పాత్ర ఎంతో ఉంది. చేనేత కార్మికులసమస్యలపై కూడా అనేక పోరాటాలు సాగాయి. వాటికి నర్రా నాయకత్వం వహించి సంఘాన్ని గుర్తింపులోకి తీసుకొ చ్చేందుకు కృషి చేశారు. పార్టీ జిల్లా, నకిరేకల్ కార్యాలయాల నిర్మాణా నికి కృషి చేశారు. గొల్లసుద్దుల - పిట్టల దొర ఇలా అనేక కళారూపాలు ప్రదర్శించి ప్రజల ఆదరణ పొందారు. సులభతరమైన సామెతలు- పొడుపు కథలు చెప్పి ప్రజల్ని అలరింప జేసేవారు. అనారోగ్యంతో బాధపడుతూ, చికిత్స పొందుతూ ఏప్రిల్ 9, 2015 న మృతి చెందారు.

# అలుపెరుగని కమ్యూనిస్టు యోధుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, ఏళ్ళతరబడి ఉద్యమాల్లో, అజ్ఞాత వాసంలో గడిపిన అలుపెరుగని కమ్యూనిస్టు నిస్వార్థ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు. కమ్యూనిస్టు పార్టీకి ఆరున్నర దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన నిబద్దత కలిగిన మహా నేత రాజేశ్వరరావు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి 28 సంవత్సరాల సుదీర్ఘ కాలం నేతృత్వం వహించిన రాజేశ్వరరావు జీవితం సైద్ధాంతిక నిబద్ధతకు, నిజాయితీకీ నిలువుటద్దం. చంద్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీ తొలితరం అగ్రనాయకుల్లో ఒకరు. పేరుకు తగినట్టుగానే ప్రత్యర్థులపై చంద్ర ప్రచండత్వం ప్రదర్శించేవారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులతో మమేకమైన కమ్యూనిస్టు ఆయన. ఎంతటి వారితోనైనా తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించేవారు. నెహ్రూ, ఇందిరాగాంధీలు తీసుకున్న నిర్ణయాల్లో ప్రజోపయోకరాలను సమర్థించినా, నిరంకుశ చర్యలను వ్యతిరేకించిన నిష్పక్షపాతి ఆయన. పీడిత, తాడిత జనోద్ధరణ కోసం ఎంతో ఉజ్వలమైన భవిష్యత్‌ను వదులు కుని కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన ఆయన పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి, తదితర పార్టీ అగ్రనాయకులతో కలిసి, దశాబ్దాల పాటు రాష్ట్రంలోనే కాక, దేశంలోని పలు ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేశారు. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలంలోని మంగళాపురం గ్రామంలో 1914 జూన్ ఆరవ తేదీన పెద్ద భూస్వాముల కుటుంబంలో జన్మించిన రాజేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీలో చేరిన తరువాత ఆ భూస్వాములకు వ్యతిరేకంగా, భూమి లేని నిరుపేదల తరపున దశాబ్దాలపాటు పోరాటం జరిపారు. రాజేశ్వరరావు ప్రాథమిక విద్యాభ్యాసం మంగళాపురంలో, సెకండరీ విద్య చల్లపల్లిలోనూ సాగింది. బందరు హిందూ స్కూలులో ఎస్సెస్సెల్సీ పూర్తిచేశారు. విద్యార్థి దశలోనే రాజేశ్వరరావు క్రీడాకారునిగా, పేదల పాలిట ఆత్మీయునిగా పేరొందారు. మహాత్మా గాంధీ పిలుపుపై సాగిన ఉప్పు సత్యాగ్రహంలో వలంటీర్‌గా పని చేశారు. యుక్తవయసులోనే విప్లవ భావాల పట్ల ఆకర్షితులయ్యారు. మహాత్మాగాంధీ ఉద్యమాల్లో పనిచేస్తున్నా, విప్లవ కిశోరాలైన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ వంటివారి పట్ల ఆరాధనా భావాన్ని పెంచుకున్నారు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకుంటున్న రోజుల్లోనే ఆయన హిందూ, ముస్లిం ఐక్యత కోసం ఎంతోకృషి చేశారు. కమ్యూనిస్టు నాయకులను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం మీరట్ కుట్ర కేసులో ఇరికించి జైళ్ళలో పెట్టినప్పుడు వారు విడుదల చేసిన ప్రకటన రాజేశ్వరావును ఉత్తేజపర్చింది. వామపక్ష భావాలున్న విద్యార్థులందరినీ ఐక్యపర్చి సాటి విద్యార్థులతో కలిసి ఒక స్టడీ సర్కిల్‌ని ఏర్పాటు చేశారు. తరువాత అది 'యంగ్ కమ్యూనిస్టు లీగ్'గా అవతరించింది. బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లోనే మతవాద, మితవాద వర్గాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి రాజేశ్వరరావు. తరచుగా ఘర్షణలకు దిగడం, కమ్యూనిస్టు వర్గానికి నాయకత్వం వహించడంతో బిఎస్సీ పూర్తి కాకముందే ఆయన యూనివర్శిటీ నుంచి టీసీ తీసుకుని బయటికి వచ్చారు. బెనారస్‌లో ఉండగానే ఆయన లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ రష్యా సందర్శించి వచ్చిన తరువాత సోషలిజం, స్వాతంత్ర్య పోరాటంలో కార్మిక, కర్షక పాత్ర, వర్గ సంఘాలు, వర్గ పోరాటాల పేరిట రాసిన వ్యాసాలు రాజేశ్వరరావును విశేషంగా ఆకర్షించాయి. అదే సందర్భంలో ఆయన మహాత్మా గాంధీని కలిసిన విద్యార్థి బృందంలో ఉన్నారు. తరువాత ఆయన విశాఖలో మెడిసిన్‌లో చేరినా, ఆయన కమ్యూనిస్టు భావాల ప్రచారానికి నిడమర్తి ఉమారాజేశ్వరరావు ప్రభృతులతో కలిసి స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టు భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం వల్ల ఆయన చదువు బెనారస్‌లోనూ, విశాఖలోనూ సవ్యంగా సాగలేదు. తండ్రి అభిమతానికి వ్యతిరేకంగా ఆయన సావిత్రమ్మతో వివాహాన్ని అతి నిరాడంబరంగా దండల మార్పుతో చేసుకున్నారు. వారి వివాహానికి ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు మద్దూరి అన్నపూర్ణయ్య పెళ్ళిపెద్దగా వ్యవహించారు. సావిత్రమ్మ కూడా భర్త మార్గంలోనే కమ్యూనిస్టు ఉద్యమం ప్రచారం కోసం జీవితాంతం కృషిచేశారు. వివాహానికి గుర్తుగా మెడలో వేసుకున్న గొలుసు రాయిని తీయించి ఎర్ర నక్షత్రాన్ని వేసుకోవడం ఆమె నిబద్ధతకు నిదర్శనం. పార్టీ నిర్ణయం మేరకు పూర్తి కాల కార్యకర్తగా పనిచేయడం కోసం ఆమె శాంతినికేతన్‌లో చదువు కోవాలనే ఆకాంక్షను బలవంతంగా అణగ దొక్కుకున్నారు. కృష్ణా జిల్లాలో కమ్యూనిస్టుపార్టీ విస్తరణకు రాజేశ్వరరావు దంపతులు విశేషంగా కృషిచేశారు. కార్మిక, కర్షక సంఘాలను ఏర్పాటు చేసి, మంగళాపురం కూలీల పోరాటానికి, చల్లపల్లి జమిందారు అక్రమాలపై ఉద్యమానికి నేతృత్వం వహించారు. కృష్ణాజిల్లా తిరువూరు తాలూకాలో నైజాం సరిహద్దున ఉన్న తునికిపాడుకు వచ్చిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి ప్రభృతులు నైజాంలో పరిస్థితి గురించి వివరించారు. ఆ క్రమంలోనే రాజేశ్వరరావుకు... ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చిర్రావూరి లక్ష్మీనరసయ్య ప్రభృతులు కూడా రావడంతో వారందరితో రాజేశ్వరరావుకు పరిచయాలు ఏర్పడ్డాయి. క్రమంగా తెలంగాణాలో అనేకసార్లు పర్యటించి తెలంగాణలో పార్టీ నిర్మాణానికీ, భువనగిరి ఆంధ్ర మహాసభ నిర్వహణకు తోడ్పడ్డారు. తెలంగాణా కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులను సమన్వయ పర్చడంలో, సాయుధ పోరాటంలో కీలకపాత్ర వహించారు. భారత విప్లవోద్యమం గురించి స్టాలిన్‌తో చర్చించేందుకు అజయ్ ఘోష్, ఎస్ఏ డాంగే, బసవ పున్నయ్యలతో పాటు రాజేశ్వరరావు మాస్కో వెళ్ళారు. రాజేశ్వరరావు ఎంత పెద్ద నాయకుడైనా ఏమాత్రం అభిజాత్యాన్ని ప్రదర్శించకుండా, నిరంతరం ఏదో తెలుసు కోవాలనే తపనతో ఉండేవారు. పుచ్చలపల్లి సుందరయ్య పట్ల ఎంతో గౌరవం ఉన్నా, అవిభక్త కమ్యూనిస్టు పార్టీ చీలినప్పుడు ఆయన భారత కమ్యూనిస్టు పార్టీకి నేతృత్వం వహించారు. రాజేశ్వరరావు సిద్ధాంతాలతో ఏనాడూ రాజీ పడలేదు. ఇందిర ప్రభుత్వం తీసుకున్న ప్రగతి శీల చర్యలకు మద్దతు ఇస్తూనే, ఆమె నిరంకుశ పోకడలను తీవ్రంగా వ్యతిరేకించే వారు. 1970వ

దశకంలో దేశవ్యాప్తంగా కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో సాగిన భూ ఆక్రమణ ఉద్యమం పార్టీ ప్రతిష్ఠను పెంచి, అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ ఉద్యమం విజయవంతం కావడంలో రాజేశ్వరరావు పాత్ర గణనీయం. ఆయన పిత్రార్జిత ఆస్తిలో తన వాటాను పూర్తిగా పార్టీకోసం వెచ్చించారు. పార్టీకి ఆయన విరాళంగా ఇచ్చిన లక్షలాది రూపాయిలతో ఆరోజుల్లో వందలాది ఎకరాలను కొనగలిగి ఉండేవారనేది వాస్తవం. ఆయన ఢిల్లీ వెళ్ళినా, ఎక్కడికి వెళ్ళినా పార్టీ కార్యాలయాల్లోనే బస చేయడం, తన బట్టలను తానే ఉతు క్కోవడం నిరాడంబర జీవితం తానికి ప్రబల నిదర్శనాలు. అక్టోబర్ విప్లవం 60వ వార్షికోత్సవాల సందర్భంగా భటిండాలో జరిగిన పార్టీ మహాసభలో ఆమోదించిన తీర్మానం చరిత్రాత్మకమైనది. రాజేశ్వరరావు సోవియట్ యూనియన్‌లో గోర్బాచెవ్ ప్రవేశపెట్టిన సహకార వ్యవసాయం, కాంట్రాక్ట్ సేద్య విధానాలను రాజేశ్వరరావు సమర్థించారు. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తరువాత సంభవించిన పరిణామాల పట్ల ఆయన చివరి రోజుల్లో ఎంతో కలత చెందారు.

# 28న గూగుల్ డేటా సెంటర్ కు శంకుస్థాపన



**విశాఖపట్టణం, ఏప్రిల్ 8, పెన్ పవర్:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. విశాఖపట్నం జిల్లాలో ఈ నెల 28వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ తో పాటు గూగుల్ సంస్థకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు. అంతర్జాతీయ దిగ్గజ సంస్థ గూగుల్ అమెరికావెలుపల అత్యధిక పెట్టుబడి 15 బిలియన్ డాలర్ల (రూ.1.35 లక్షల కోట్లకు పైగా) వ్యయంతో చేపడుతున్న మొదటి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ను నిర్మించనున్నారు. 2028 చివరికి డేటా సెంటర్ పనులు పూర్తి చేసి, ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. గూగుల్ డేటా సెంటర్కు మూడు చోట్ల మొత్తం 601.4 ఎకరాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. విశాఖ జిల్లా ఆనందపురం తర్లువాడలో 266.6 ఎకరాలు, విశాఖ గ్రామీణ మండలం అడవివరంలో సింహాచలం దేవస్థానానికి చెందిన 160 ఎకరాలు, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఏపీఐఐసీకి చెందిన 174.8 ఎకరాలు కేటాయించారు.గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్, అదానీ ఇన్ఫ్రా భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారుగూగుల్ సంస్థ ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్ల కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ సంస్థ గత ఏడాది అక్టోబర్ 14న ఎంవోయూపై సంతకాలు చేశాయి. అవసరమైన భూమిని ప్రభుత్వం గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కు అప్పగించింది. మూడు డేటా సెంటర్ల ఏర్పాటుతో విశాఖపట్నం ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ క్లస్టర్గా గుర్తింపు పొందే అవకాశం ఉంది. దీనికోసం 601.40 ఎకరాలను ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది.విశాఖపట్టణం తీర ప్రాంతం కావడంతో ఇక్కడి నుండి సింగపూర్,
మలేషియా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు సముద్రగర్భ కేబుల్ వ్యవస్థల ద్వారా నేరుగా అనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల విశాఖ నగరం అంతర్జాతీయ డేటా కనెక్టివిటీ ప్రధాన కేంద్రంగా మారనుంది.

# విజయవాడ స్టేడియానికి మహర్ధశ

**విజయవాడ, ఏప్రిల్ 8, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అంతర్జాతీయ హంగులు అద్దుకోబోతోంది. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ స్టేడియంను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పునరుద్ధరించాలని నిర్ణయించింది. విజయవాడ నగరాన్ని ఒక స్పోర్ట్స్ హబ్గా తీర్చిదిద్దే క్రమంలో ఇది మొదటి అడుగుగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఆధునీకరణ పనులకు సంబంధించి ఈ నెల 8వ తేదీన అధికారికంగా శంకుస్థాపన జరగనుంది.రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఈ కార్యక్రమానికి హాజరై పనులను ప్రారంభించనున్నారు. క్రీడాకారుల కోసం అత్యాధునిక వసతులు మరియు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఈ భారీ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. పునరుద్ధరణలో భాగంగా స్టేడియంలో అత్యాధునిక రన్నింగ్ ట్రాక్స్, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఇండోర్, అవుట్ డోర్ కోర్టులు నిర్మించనున్నారు. శిక్షణలో ఉండే క్రీడాకారుల కోసం అధునాతన హాస్టల్ సౌకర్యాలు, జిమ్ మరియు ఇతర సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.భవిష్యత్తులో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లకు ఈ స్టేడియం వేదికగా మారనుంది. ప్రపంచ స్థాయి పోటీలకు సరిపడేలా స్టేడియం సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు స్థానికంగానే అత్యుత్తమ శిక్షణ అందేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల బెజవాడ క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ప్రభుత్వం మొత్తం రూ. 53 కోట్లు వెచ్చించనుంది. ఇందులో మొదటి విడతగా రూ. 30 కోట్లతో పనులను ప్రారంభించనున్నారు.2027 నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసి, 2029లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను ఇక్కడ నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన స్టేడియం మధ్యలో 400 మీటర్ల పొడవైన, 8-లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న శాప్ ప్రధాన కార్యాలయాన్ని తొలగించి, ఆ స్థానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను నిర్మించనున్నారు. టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ మరియు కబడ్డీ కోసం అదనంగా కొత్త ఔట్‌డోర్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు.

# మళ్లీ తెరపైకి గ్రేటర్ రాయలసీమ

**కర్నూలు, ఏప్రిల్ 8,పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ వాదం తెరపైకి వచ్చింది. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగిన టైమ్‌లోనే రాయలసీమ అస్తిత్వం అంటూ చర్చలు జరిగాయి. ఇప్పుడు గ్రేటర్ రాయలసీమ అంటూ మాజీమంత్రి మైసూరారెడ్డి మరోసారి స్లోగన్ అందుకున్నారు. నవ్యాంధ్రలో ఇప్పుడిప్పుడే రాజధాని వ్యవహారం ఒక కొలిక్కి వచ్చిందని అంతా అనుకుంటున్నారు. ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణా విడిపోయాక 2014 నుంచి 12 ఏళ్లుగా ఏపీ రాజధాని అంశం ప్రతి రోజు చర్చకు వస్తోంది.ఇప్పుడు అమరావతి రాజధానిగా పార్లమెంట్ ఉభయసభలు లైన్ క్లియర్ చేసినా..వైసీపీ మాత్రం మావిగన్ స్లోగన్ బలంగా వినిపిస్తోంది. ఏపీ రాజధానిగా అమరావతికి హోదా దక్కిందన్న సంతోషం దక్కిందో లేదో..వైసీపీ క్యాపిటల్ ఫైట్‌కు తెరలేపింది. సరే అది ఎప్పటికీ ఉండే ముచ్చటే అనుకుంటే..సీనియర్ రాజకీయ నేత మాజీమంత్రి మైసూరారెడ్డి ఒక బాంబు పేల్చారు. ఏపీలో రాజధాని పరిణామాలు, రాజకీయాలు చూస్తుంటే గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం తప్పదని అనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు.ఏపీలో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన సమయంలో ఆనాటి కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిషన్ చేసిన సిఫార్సులను గుర్తు చేశారు. అమరావతి ప్రాంతాన్ని కానీ విజయవాడ గుంటూరును కానీ రాజధానిగా ఎంపిక చేయొద్దని శివరామకృష్ణన్ కమిషన్ కీలక సూచనలు చేసిందంటున్నారు. దొనకొండ దగ్గర ఏకంగా 70 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కూడా కమిషన్ చెప్పిందన్నారు. అంతే కాదు రాజధాని నిర్మాణం కోసం వ్యవసాయ భూములను తీసుకోవద్దని ప్రైవేట్ భూములు అంతకంటే తీసుకోవద్దని కమిషన్ చెప్పిందంటున్నారు.కానీ 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పట్టుబట్టి మరీ వ్యవసాయ భూములు, పైగా ముంపు ప్రాంతం అయిన అమరావతిని ఎంపిక చేశారని మైసూరారెడ్డి విమర్శించారు. మావిగన్ పేరుతో జగన్ కొత్త ప్రతిపాదనలు చేయడం మరింత బాధాకరం అన్నారు. నాడు అమరావతికి ఓకే చెప్పి..ఆ తర్వాత మూడు రాజధానుల నినాదాన్ని ముందుకు తెచ్చారన్నారు. ఇప్పుడు మావిగాన్ అంటూ అర్థం పర్దం లేని మాటలు ఎందుకు అంటూ మండిపడ్డారు. శివరామ కృష్ణన్ కమిషన్ వద్దు అన్నచోటే ఈ ఇద్దరు నాయకులు రాజధాని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఈపాటికే గ్రేటర్ రాయలసీమ ఉద్యమాన్ని ప్రారంభించాల్సి ఉందని, వయసు కారణంగా ఆగిపోతున్నానని అంటున్నారు. కానీ రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై యువత స్పందించాలని వారు గ్రేటర్ రాయలసీమ నినాదంతో ఉద్యమించాలని మైసూరారెడ్డి పిలుపు ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది.గ్రేటర్ రాయలసీమ డిమాండ్ కొత్తేమీ కాదు. ఏపీ, తెలంగాణ విభజన సమయంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ రాయల తెలంగాణ కావాలని సోనియా గాంధీకి విన్నవించారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలను తెలంగాణతో కలిపితే అది ఒక బలమైన రాజకీయ శక్తిగా మారుతుందని ఆయన కోరారు. ఇక బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి లాంటి వాళ్లు ప్రత్యేక రాయలసీమ అంటూ దీక్షలు కూడా చేశారు. రాయలసీమ హక్కులు, నీళ్లు, నిధులు అంటూ కొన్నాళ్లు హడావుడి చేసి సైలెంట్ అయిపోయారు. గ్రేటర్ రాయలసీమ అంటూ మైసూరారెడ్డితో పాటు గంగుల ప్రతాప్‌రెడ్డి వంటి నేతలు గతంలోనే తెరమీదకు తెచ్చారు.ఆంధ్రప్రదేశ్ పర్యాటకంఒకప్పటి రాజధాని కర్నూలుతో పాటు మొత్తం రాయలసీమ ప్రాంతానికి ఇప్పటికీ అన్యాయం జరుగుతుందని చెబుతున్న నేతలు..కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు దక్షిణ కోస్తా జిల్లాలైన నెల్లూరు, ఒంగోలు జిల్లాలను కలిపి గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం చేయాలన్నది వీరి ప్రధాన డిమాండ్. 2014లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కూడా కొందరు సీమకు అన్యాయం జరుగుతోందని ఆందోళనలు చేపట్టారు. కానీ, 2019 నుంచి 2024 వరకు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో ఈ గళం పూర్తిగా మూగబోయింది. ఆ సమయంలో రాయలసీమ గురించి ఏ ఒక్కరూ నోరు మెదపలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా..ఓ వైపు అమరావతికి చట్టబద్ధత దక్కిన వేళ..గ్రేటర్ రాయలసీమ నినాదాన్ని పొలిటికల్ స్క్రీన్‌పైకి తేవడం ఆసక్తికరంగా మారింది.

# కూటమి ధీమా వెనుక కథేంటీ

**ఒంగోలు, ఏప్రిల్ 8, పెన్ పవర్:**
ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైమ్ ఉంది. కానీ రాబోయే ఎన్నికలపై ఇప్పటి నుంచే చర్చ జరుగుతోంది. కూటమి లాంగ్ లీవ్ అంటున్న చంద్రబాబు, పవన్.. వైసీపీ మళ్లీ రాదు గాక రాదు అని తెగేసి చెప్తున్నారు. వచ్చే టర్మే కాదు..రాబోయే 30ఏళ్ల వరకు కూడా వైసీపీకి అవకాశమే ఇవ్వము అన్నట్లుగా చెప్పుకొస్తున్నారు. థర్టీ ఇయర్స్ స్థిరమైన నాయకత్వం ఉండేలా ప్లాన్ చేస్తున్నామని అంటున్నారు సీఎం చంద్రబాబు.ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, అసహనం కలిసి వస్తాయని వైసీపీ దింపుడు కళ్లం ఆశ పెట్టుకుని కూర్చుందని..అది జరగదని క్లియర్ కట్‌గా చెప్పేస్తున్నారు టీడీపీ అధినేత. గత ఎన్నికల కంటే కూటమి..ఎస్పెషల్‌గా టీడీపీ మెరుగైన స్థానంలో ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు చేసిన ఈ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చుట్టూ ఆసక్తికర చర్చ జరుగుతోందివైసీపీ మళ్లీ అధికారంలోకి రాదు. ఎలా పవర్‌లోకి వస్తారో చూస్తానంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రిపీటెడ్‌గా కామెంట్స్ చేస్తున్నారు. ఓ రకంగా వైసీపీకి ఛాలెంజ్ కూడా చేస్తున్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు కూడా సుత్తి లేకుండా సూటిగా చెప్పేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందన్న ఆశలు వద్దు. మీకు ఆ ఛాన్స్ ఇవ్వం. అంత సీన్ కూడా లేదంటున్నారు.రాబోయే 30 ఏళ్ల పాటు స్థిరమైన నాయకత్వం ఉండేలా మాస్టర్ స్కెచ్ వేస్తున్నామని..అలా అయితే ఏపీ డెవలప్‌మెంట్ అన్‌స్టాపబుల్ అన్నట్లుగా పరుగులు పెడుతుందని చెప్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి కోలుకోవడానికే సమయం పడుతుందని..అలాంటిది ఏపీ మిగతా రాష్ట్రాలతో పోటీ పడేలా..దేశంలో అగ్రగామిగా నిలబడాలంటే..బలమైన, స్థిరమైన నాయకత్వం అవసరమని అంటున్నారుఅయితే ప్రభుత్వ వ్యతిరేకత మీదే వైసీపీ హోప్స్ పెట్టుకుందని ..కానీ అలా జరగనివ్వబోమని చెప్పడం ఇంట్రెస్టింగ్‌గా మారింది. బాబు ఇంత ఔట్ రైట్‌గా ఓ కామెంట్ చేయడం అంటే ఆశామాషీ కాదు. ఆయన థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా పాలిటిక్స్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన నాయకుడు. అలాంటి చంద్రబాబు తమ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రాదు..రానివ్వమంటూ ధీమా వ్యక్తం చేయడం..ఇండైరెక్ట్‌గా ఫ్యాన్ పార్టీని ఛాలెంజ్ చేయడం పొలిటికల్ హాట్ టాపిక్‌గా మారిందఇంతకు బాబు ధైర్యం వెనుకున్న రహస్యం ఏంటన్నదే డిబేట్ పాయింట్ అవుతుంది. అధికారంలో ఉండి..పైగా ఇంకో మూడేళ్ల పాలన మిగిలి ఉండగానే..వైసీపీ ఎత్తులను పసిగట్టడం ఒక ఎత్తు అయితే..వైసీపీ పెట్టుకున్న ఆశలు అడిఆశలు అవుతాయని చెప్పడం మరో ఎత్తు. అయితే బాబు ఇంత కాన్ఫిడెంట్‌గా ఉండటానికి రీజనేంటి అన్నదే చర్చకు దారితీస్తోంది.నిజానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బాబు..చాలా జాగ్రత్త పడుతున్నారు. ఎక్కడా ప్రజా వ్యతిరేకత రాకుండా..ప్రతీ విషయంలో కేర్ తీసుకుంటున్నారు. ఎమ్మెల్యేల పనితీరు అయినా..అభివృద్ధి విషయంలో అయినా..సంక్షేమ పథకాలు అమలులో అయినా..రాజకీయ విమర్శల్లో కూడా ఎక్కడా చిన్న మిస్టేక్ జరగకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నారు.ప్రజా వ్యతిరేకత రాకుండా ప్లాన్ చేసుకోవడం ఒక ఎత్తు అయితే..ఎప్పటికప్పుడు ప్రజలు కూటమి ప్రభుత్వం గురించి ఏమనుకుంటున్నారు? ఏ విషయంలో అసంతృప్తిగా ఉన్నారని

పబ్లిక్ పల్స్ తెలుసుకుంటున్నారు. పైగా సంక్షేమ పథకాల విషయంలో ఇచ్చిన మాట ప్రకారం ఒకదాని తర్వాత మరో హామీని అమలు చేసుకుంటూ వస్తున్నారు.ఇప్పటికే కీలక పథకాలన్నింటిని గ్రౌండ్ చేశారు. మిగిలిన చిన్న చితక హామీలేమైనా ఉంటే ఎన్నికల నాటికి అవి కూడా ఇంప్లిమెంట్ చేసే ఆలోచనలో ఉన్నారట. ఈ అన్ని విషయాలపై బేరీజు వేసుకుని..క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకున్నాకే చంద్రబాబు భరోసా పెరిగిందన్న టాక్ వినిపిస్తోంది. ఏదైనా వైసీపీని టార్గెట్ చేస్తూ టీడీపీ అధినేత చేసిన వ్యాఖ్యలు అయితే ఏపీ పాలిటిక్స్‌లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్‌కు దారితీశాయి.

## విశాఖ టూ మావిగన్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 8, పెన్ పవర్:** రాజధానుల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక స్టాండ్ అంటూ లేకుండా పోతోంది. మొన్నటి వరకు మూడు రాజధానులు అన్న జగన్మోహన్ రెడ్డి మావిగన్ ప్రతిపాదన తీసుకొచ్చారు. మచిలీపట్నం- విజయవాడ- గుంటూరును కలుపుతూ మావిగన్ రాజధాని ఏర్పాటు చేయాలని ప్రత్యామ్నాయం సూచించారు. దాదాపు అమరావతి రాజధానికి దగ్గరగానే ఆయన సూచనలు ఉన్నాయి. కానీ ఇన్ని పరిణామాలు జరిగిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ఈ మాట చెప్పడమే విమర్శలకు తావిస్తోంది. చంద్రబాబు అమరావతి ప్రతిపాదన చేసినప్పుడే ఈ మావిగన్ సూచించి ఉంటే బాగుండేది. పోనీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులు అనేకంటే.. ఈ మావిగన్ ప్రతిపాదన చేసి ఉంటే బాగుండేది. కానీ ఇప్పుడు ఆ ప్రతిపాదన చేస్తుండడం మాత్రం ఇబ్బందికరంగా మారింది. అనవసరంగా ఆయన టార్గెట్ అవుతూ వస్తున్నారు.ఒకవైపు మావిగన్ ప్రతిపాదన చేయగా.. ఇంకోవైపు ధర్మాన లాంటి సీనియర్ నేత వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ అన్యాయం గురించి ప్రశ్నిస్తున్నారు. నిన్నటి వరకు ఇదే ధర్మాన మేధావి ఉత్తరాంధ్రకు రాజధాని ప్రకటించడాన్ని హర్షించారు. విశాఖ పాలన రాజధానిని ఆహ్వానించారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో ఊరువాడ ప్రచారం చేశారు. కానీ ఇప్పుడు ఆయన జగన్మోహన్ రెడ్డిని ఏం అనడం లేదు. ఆది నుంచి చంద్రబాబు స్టాండ్ అమరావతి. ఆయన మాట మార్చలేదు. కానీ మూడు రాజధానుల్లో భాగంగా విశాఖను పాలన రాజధాని చేస్తానన్నారు జగన్. దానిని విస్తృతంగా ప్రచారం చేశారు ధర్మాన. 2024 ఎన్నికలకు ముందు ఈ సీనియర్ నేత తన సొంత నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో దీనిపైనే డిబేట్ పెట్టారు. ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు జగన్ మూడు రాజధానుల నుంచి మావిగన్ వైపు వెళ్తే దాని గురించి పట్టించుకోవడం లేదు.ప్రస్తుతం ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగింది అంటే అది జగన్మోహన్ రెడ్డి చేసినట్టే. జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్రలోని విశాఖను పాలనా రాజధానిగా ప్రకటించారు. దానిని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు ధర్మాన. ఇప్పుడు అదే జగన్ విశాఖ కాదు మావిగన్ అంటున్నాడు. కానీ ధర్మాన జగన్మోహన్ రెడ్డిని విడిచిపెట్టి చంద్రబాబును టార్గెట్ చేస్తున్నారు. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని.. విభజన చట్టమే చెప్పిందని.. 80 ఏళ్ల వయసులో కూడా ఉత్తరాంధ్ర ప్రజలు పొట్ట చేత పట్టుకుని వలస వెళ్తున్నారని.. రాయలసీమ బిడ్డగా ఉండి ఆ ప్రాంత అభివృద్ధికి చంద్రబాబు ఏం చేశారని నిలదీస్తున్నారు ధర్మాన. కానీ విశాఖ పాలన రాజధానిగా ప్రకటించి.. దాని నుంచి పక్కకు తప్పుకుంటున్న జగన్మోహన్ రెడ్డిని మాత్రం ఏమీ అనడం లేదు. అందుకే ధర్మాన అపరమేధావి అయ్యారు. శ్రీకాకుళం జిల్లా ప్రజలు నమ్మలేని స్థితికి చేరుకున్నారు.

## ఎందుకు జూన్ 2024 తీసుకున్నారు...

**విజయవాడ ఏప్రిల్ 8, పెన్ పవర్:** ఏపీప్రజల ఆకాంక్ష నెరవేరింది. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత లభించింది. ఏపీ ఏకైక రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ.. ఏపీ పునర్విభజన చట్టం 2014 సవరిస్తూ తీసుకొచ్చిన బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేయగా.. న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2024 జూన్ రెండు నుంచి ఏపీ రాజధానిగా అమరావతిని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. అమరావతి గెజిట్ నోటిఫికేషన్ లో 2024 జూన్ రెండు నుంచి రాజధానిగా గుర్తించినట్టు పేర్కొనడంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. అదే తేదీ నుంచి ఎందుకు అని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.2014లో రాష్ట్ర విభజన జరిగింది. ఉమ్మడి ఏపీకి హైదరాబాద్ రాజధానిగా ఉండేది. అయితే విభజన తర్వాత కూడా అంటే 2014 నుంచి 2024 వరకు పదేళ్లపాటు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ను ఉంచారు. అయితే ఆ గడువు 2024 జూన్ 2 తో ముగిసింది. ఈ క్రమంలోనే 2024 జూన్ రెండు నుంచి అమరావతి ఏకైక రాజధానిగా పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది.అయితే ఈ నిర్ణయం వెనుక రెండు కారణాలు ఉన్నాయి. ఉమ్మడి రాజధానిగా హైదరాబాదుకు ఇచ్చిన గడువు ముగియడం ఒకటి అయితే.. మూడు రాజధానుల ఎపిసోడ్ కు చెక్ పెడుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అయింది. రాబోయే రోజుల్లో ఎలాంటి వివాదాలు లేకుండా చట్ట సవరణపై స్పష్టత ఇచ్చారు. ఒకవేళ భవిష్యత్తులో రాజధాని అమరావతి ఏవైనా మార్పులు, చేర్పులు చేయాలంటే పార్లమెంటుకు మాత్రమే అధికారం కట్టబెట్టారు. శాసనసభలో సవరణ చేసి మార్పు చేస్తామంటే కుదిరే పని కాదు.అయితే అంతా మూడు రాజధానులకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే అమరావతికి చట్టబద్ధత కల్పించారని భావించారు. కానీ ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కు ఉన్న గడువు ముగిడంతోనే ఈ కీలక నిర్ణయం తీసుకున్నారన్న విషయం చాలామందికి తెలియదు. ఎంతవరకు మూడు రాజధానులకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే.. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనుకున్నారు. కానీ 2024 జూన్ 2 తో హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగిసిందని కేవలం కొద్ది మందికి మాత్రమే తెలుసు

## అంతర్జాతీయ హోటల్ గా రుషికొండ

**విశాఖపట్టణం ఏప్రిల్ 8,పెన్ పవర్:** రుషికొండ భవనాల అదృష్టం త్వరలో మారబోతోంది. ఈ ప్యాలెస్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవాలనే అంశంపై కేబినెట్ సబ్ కమిటీ కసరత్తును ముగించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఈ భవనాలను ప్రజాధనానికి భారంగా కాకుండా, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే వనరుగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 10న జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకుని, అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.గతంలో రుషికొండపై ఉన్న హరిత రిసార్ట్స్ ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి సుమారు 7 కోట్ల రూపాయల ఆదాయం వచ్చేది. కానీ ప్రస్తుతం నిర్మించిన ప్యాలెస్ నిర్వహణకే నెలకు 25 లక్షల రూపాయల వరకు ఖర్చవుతోంది. విద్యుత్ ఛార్జీలు, ఇతర నిర్వహణ ఖర్చులు కలిపి ఏడాదికి 3 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చవుతుండటంతో, ప్రభుత్వం దీనిని ప్రోపర్ యుటిలైజేషన్ చేయాలని నిర్ణయించింది. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, సుమారు 1517 మంది నుంచి సేకరించిన సూచనల ఆధారంగా ప్రభుత్వం ఒక ప్రణాళికను రూపొందించింది. రుషికొండ ప్యాలెస్ నిర్వహణకు ప్రపంచస్థాయి గుర్తింపు ఉన్న లితాజ్ గ్రూప్, ఎట్మాస్పియర్ కోర్, లీలా, ఫెమా వంటి నాలుగు ప్రముఖ సంస్థలు ఆసక్తి కనబరిచాయి. ఈ భవనాలను ఒక విలాసవంతమైన హోటల్ లేదా రిసార్ట్‌గా మార్చడం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ నాలుగు గ్రూపుల్లో ఒకదానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించి, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్యాలెస్‌ను కమర్షియల్ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నప్పటికీ, సామాన్య ప్రజలు కూడా ఆ భవనాలను సందర్శించేలా నిబంధనలు రూపొందిస్తున్నారు. ఇది కేవలం ఒక రహస్య బంగ్లాగా మిగిలిపోకుండా, విశాఖ పర్యాటకంలో ఒక భాగంగా మార్చాలని కేబినెట్ సబ్ కమిటీ ప్రతిపాదించింది. ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు, ప్రజలకు కూడా దీని వల్ల ప్రయోజనం ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈనెల 10న కేబినెట్ ఆమోదం పొందిన వెంటనే ఈ విలాసవంతమైన భవనాల కొత్త రూపం ఖరారు కానుంది.

## బెదిరింపులతో సరేనా.... చర్యలకు దిగుతారా

**విజయవాడ ఏప్రిల్ 8,పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్లీన్ పాలిటిక్స్ నినాదంతో వచ్చిన జనసేన పార్టీకి ఇప్పుడు తన సొంత ఎమ్మెల్యేల వ్యవహారశైలి పెద్ద సవాలుగా మారింది. 100 శాతం స్ట్రైక్ రేట్‌తో 21 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్న పవన్ కళ్యాణ్, ఇప్పుడు వారిపై వస్తున్న వరుస ఆరోపణలతో డిఫెన్స్‌లో పడాల్సి వస్తోంది. కొత్తగా ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేల అతి ఉత్సాహం, వ్యక్తిగత వివాదాలు, ఆర్థిక ఆరోపణలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యక్తిగత వ్యవహారం ఇప్పుడు జనసేన పార్టీకి నైతిక సంక్షోభాన్ని తెచ్చిపెట్టింది. ఆయనపై వచ్చిన ఆరోపణలు, ఆపై బాధితురాలిపై జనసేన కార్యకర్తలు దాడికి పాల్పడ్డారన్న వార్తలు సోషల్ మీడియాలో దావానలంలా వ్యాపించాయి. హైకమాండ్ ఈ విషయంలో త్వరితగతిన స్పందించి కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల, క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్ అయోమయానికి గురవుతోంది. తప్పు చేస్తే సొంత వారినైనా వదలను అని చెప్పే పవన్ కళ్యాణ్, ఈ విషయంలో మౌనం వహించడం ప్రత్యర్థులకు ఆయుధంగా మారింది.విశాఖపట్నం శివారు నియోజకవర్గాల పరిధిలోని ఒక కీలక ఎమ్మెల్యేపై పారిశ్రామికవేత్తల నుండి, రియల్టర్ల నుండి భారీగా వసూళ్లు చేస్తున్నారనే ఫిర్యాదులు పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ముఖ్యంగా భూ వివాదాల్లో తలదూర్చడం, సెటిల్మెంట్లు చేయడం వంటి పాత రాజకీయ వాసనలు జనసేన ఎమ్మెల్యేల నుంచి రావడం పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధం. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఇలాంటి ఆర్థిక ఆరోపణలు రావడం భవిష్యత్తులో పార్టీ ఉనికికే ప్రమాదకరంగా మారవచ్చు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి చుట్టూ ఇప్పుడు మనీలాండరింగ్ ఆరోపణలు తిరుగుతున్నాయి. విచారణ సంస్థల వద్ద ఉన్న సమాచారం అంటూ వస్తున్న వార్తలు జనసేనను ఇరకాటంలోకి నెట్టాయి. ఒకవైపు పవన్ కళ్యాణ్ అవినీతి రహిత పాలన గురించి మాట్లాడుతుంటే, మరోవైపు కీలక మహిళా ఎమ్మెల్యేపై ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు రావడం పార్టీకి కొత్త సమస్యలను సృష్టిస్తోంది.జనసేన ఎమ్మెల్యేలలో అత్యధికులు రాజకీయాలకు కొత్త వారు కావడమే ఈ సమస్యలకు మూలమని భావిస్తున్నారు. తొలిసారి అధికారం దక్కడంతో, దానిని ఎలా నిర్వహించాలో తెలియక కొందరు అహంకారం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, నియోజకవర్గాల్లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల కూటమిలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలతో కూడా ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఈ అపరిపక్వత పవన్ కళ్యాణ్ కష్టపడి సంపాదించిన విశ్వసనీయత ను దెబ్బతీస్తోంది.ఇటీవల పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశమై, ప్రజల్లో వ్యతిరేకత వస్తే ఉపేక్షించేది లేదు అని ఘాటుగా హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై రహస్యంగా సర్వేలు చేయిస్తున్నానని, అవినీతికి పాల్పడితే టికెట్లు ఉండవని కూడా స్పష్టం చేశారు. జనసేన పార్టీ భవిష్యత్తు ఇప్పుడు పవన్ కళ్యాణ్ తీసుకునే కఠిన నిర్ణయాలపైనే ఆధారపడి ఉంది. కేవలం సలహాలు, సూచనలతో సరిపెట్టకుండా, వివాదాస్పద ఎమ్మెల్యేలను పక్కన పెట్టడం లేదా బాధ్యతల నుండి తప్పించడం వంటి చర్యలు తీసుకుంటేనే పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం నిలుస్తుందని భావిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇజ్రాయిల్ కొత్త వ్యూహం!

**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్యప్రాచ్యంలో శాంతిని పునరుద్ధరించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్‌లు కాల్పుల విరమణ ప్రకటించిన కొద్దిసేపటికే ఇజ్రాయి ల్ ఒక కొత్త ఆరోపణ చేసింది. ఇరాన్ నుంచి క్షిపణి దాడి జరిగిందని ఇజ్రాయెల్ సైన్యం ఆరోపించింది. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిస్తే కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామని ట్రంప్ ప్రకటించారు. అయితే, ఈ ప్రకటన వెలువడినప్పటి నుంచి ఇజ్రాయి ల్ సైన్యం మూడుసార్లు హెచ్చరించింది. ఇజ్రాయిల్‌ను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ నుంచి క్షిపణులు, రక్షణ వ్యవస్థలు సిద్ధంగా ఉన్నాయని ఇజ్రాయిల్ సైన్యం అధికారిక టెలిగ్రామ్ ఛానల్ ప్రకటించింది.పాకిస్తాన్ ద్వారా అమెరికా, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న శాంతి చర్చలను భగ్నం చేయడానికి ఇజ్రాయి ల్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నమే ఇది అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అమెరికా మద్దతుతో మధ్యప్రాచ్యంలో తన ఆధిపత్యాన్ని కొనసాగించాలనుకుంటున్న నెతన్యాహు వ్యూహానికి ఈ కాల్పుల విరమణ ఒప్పందం ఒక ఎదురుదెబ్బ. ఒప్పందంతో యుద్ధం ముగియకుండా ఇజ్రాయిల్ అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇరాన్ పది శాంతి ప్రతిపాదనలపై చర్చలకు అమెరికా అంగీకరించిన తర్వాత ఇజ్రాయిల్ పెద్ద సంక్షోభంలో పడింది. ఈ పరిస్థితిలో, క్షిపణి దాడి చేస్తున్నట్లు నటిస్తూ కాల్పుల విరమణను ఉల్లంఘించడానికి ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోందని నివేదికలు సూచిస్తున్నాయి. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ప్రజా ప్రతిఘటనను అణచివేసి, ఇరాన్‌ను తిరిగి యుద్ధంలోకి లాగాలనే ఇజ్రాయి ల్ సామ్రాజ్యవాద కుయుక్తి ఈ కొత్త చర్య వెనుక ఉంది.

## ఇరాన్ నాగరికతను అంతం చేస్తాం!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ నాగరికతను అంతం చేస్తానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి పేట్రేగిపోయారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్‌లో ఆయన చేసిన పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. 'ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రికే (భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయానికి) అంతమైపోతుంది. దానిని ఎవ్వరూ పునరుద్ధరించలేరు.' ' అలా జరగాలని నేను కోరుకోవడం లేదు. కానీ కానీ, ఆ విధంగా చెయ్యక తప్పట్లేదు.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి నిలిచిపోతుంది.' అని కూడా ఆయన పేర్కొన్నారు. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళన ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తమైంది. ఇరాన్ నాగరికత మొత్తం అంతమవుతుందంటూ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అమెరికా అణు ఆయుధాలు ప్రయోగించే అవకాశం ఉందన్న విశ్లేషణలు వ్యక్తమయ్యాయి. అయితే, దీనిని వైట్‌హౌస్ అధికారులు ఖండించారు. అటువంటి అవకాశం లేదని వైట్‌హౌస్ అధికారులు తెలిపినట్లు 'ఆల్‌జజీర' వార్తా సంస్థ ఒక కథనంలో పేర్కొంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడి ప్రకటనపై ఇరాన్ దీటుగా స్పందించింది. తనతో పాటు 1.40 కోట్ల మంది ఇరాన్ ప్రజలు ఈ యుద్ధంలో ప్రాణ త్యాగం చేయడానికి సిద్ధంగా వున్నారని ఆయన ప్రకటించారు. మాతృభూమి రక్షణ కోసం కావాలంటే స్వచ్ఛందంగా ప్రాణాలు ఇస్తామంటూ ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇరాన్ అధ్యక్షుడి ప్రకటన వెలువడిన కాసేపటికే అమెరికా గనుక లక్ష్మణ రేఖను ఉల్లంఘిస్తే ప్రతిస్పందన పశ్చిమాసియా ప్రాంతాలను దాటి వుంటుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) హెచ్చరించింది. తమ సహనం నశించిందని, అమెరికా, ఇజ్రాయిల్ సహా వాటి మిత్రదేశాలపై దాడులు చేస్తామని ప్రకటించింది. అదే సమయంలో యుద్ధ రంగానికి తరలాలంటూ దేశ యువతకు పిలుపునిచ్చింది. తమ పిల్లలను సరిహద్దులకు పంపాలని తల్లితండ్రులను కోరింది. యుద్ధభూమిలో నిలబడినప్పుడే వారు యోధులుగా ఎదుగుతారని పేర్కొంటూ ఈ విజ్ఞప్తి చేసింది. దీనికి కొన్ని గంటల ముందు విడుదల చేసిన మరో ప్రకటనలో విద్యుత్ ప్లాంట్ల వద్ద మానవ హారాలు నిర్మించాలని యువతను కోరింది. దేశంలోని మౌలిక వనరులపై దాడులు చేస్తామంటూ రెండు రోజుల క్రితం ట్రంప్ చేసిన హెచ్చరికను ఆ ప్రకటనలో ఇఆర్‌జిపి పేర్కొంది. ఆ ప్రకటనలో మంగళవారం అర్ధరాత్రి వరకు సమయం ఇస్తున్నట్లు పేర్కొన్న ట్రంప్ తాజాగా, ఇక ఎటువంటి పొడిగింపులు ఉండవని, ఇరాన్ నాగరికతను అంతం చేస్తామని హెచ్చరించారు.

## గాజాలో 8 వేల మందికిపైగా చిన్నారులు గల్లంతు

**హైదరాబాద్ పెన్ పవర్:** 2023 అక్టోబర్ 7న ప్రారంభమైన పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడుల వల్ల లక్షలాది మంది మరణించారు. 29 నెలలపాటు జరిగిన ఇజ్రాయిల్ దాడుల వల్ల గాజాలో 21,510 మంది మృతి చెందారు. ఇప్పటికీ 8 వేల మంది చిన్నారులు ఆచూకీ లేరు. బాంబుల దాడికి కూలిపోయిన భవనాల శిథిలాల కింద 2,100 మంది చిక్కుకుపోయారని తాజాగా పాలస్తీనా కేంద్రం వెల్లడించింది. వేలాది మంది చిన్నారులు అదృశ్యమవ్వడంపై పాలస్తీనా ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో వివిధ ప్రాంతాల్లో సుమారు 200 మంది మైనర్లు ఆచూకీ లేకుండా అదృశ్యమయ్యారు. ఇజ్రాయిల్ దాడుల వల్లే వారు గల్లంతయ్యారని అనుమానాలున్నాయని పాలస్తీనా కేంద్రం నివేదించింది. ఇజ్రాయిల్ దాడులకు గురైన అత్యంత ప్రభావితమైన ప్రాంతంలోనూ, మానవతా సహాయం కోసం ఎదురుచూసే ప్రదేశాల్లోనూ, ఆహారం కోసం వెతుకున్నప్పుడు గానీ పిల్లలు అదృశమయ్యారని పాలస్తీనా కేంద్రం నివేదిక వివరించింది.

## దాడుల లక్ష్యం ఇరాన్ ప్రభుత్వమే

**హైదరాబాద్ పెన్ పవర్:** తమ దేశం ఇరాన్ ప్రభుత్వాన్ని బలంగా ధ్వంసం చేస్తోందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మంగళవారం పేర్కొన్నారు. ఇరాన్ ప్రభుత్వంపై దాడి చేస్తున్నామే తప్ప అక్కడి ప్రజలపై కాదన్నది గుర్తించాలని ఆయన స్పష్టం చేశారు. "ఇరాన్‌లోని ఉగ్రవాద ప్రభుత్వాన్ని ధ్వంసం చేయడమే మా లక్ష్యమని నేను పదే పదే చెబుతున్నాను. రెట్టించిన బలంతో ఇరాన్ ప్రభుత్వాన్ని ధ్వంసం చేస్తున్నాం" అని చెప్పారు. హర్మూజ్ జలసంధి దిగ్బంధనాన్ని తొలగించేందుకు ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "నిన్న మా పైలట్లు ఇరాన్‌లోని విమాన శిబిరంపై దాడిచేసి పలు రవాణా విమానాలను, డజన్ల కొద్దీ హెలికాప్టర్లను ధ్వంసం చేశారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ ఉపయోగించే వంతెనలను, రైలు పట్టాలను ఈరోజు దిబ్బగా మార్చేశాం. ఐఆర్‌జీసీ తన ఆయుధాలను, ముడి సరుకులను, మాపై దాడికి పాల్పడే సైనికులను రవాణా చేసేందుకు ఈ సదుపాయాలను ఉపయోగించేది. అదే సైన్యాన్ని ఉపయోగించి ఇరాన్ ప్రజానీకాన్ని అణచివేతకు గురిచేసేది" అని నెతన్యాహు అన్నారు.

## ఇది యుద్ధానికి ముగింపు కాదు: మొజ్తాబా ఖమేనీ

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా– ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ కీలక ప్రకటన చేశారు. ఈ కాల్పుల విరమణ యుద్ధానికి ముగింపు కాదని స్పష్టంచేశారు. కాల్పుల విరమణ ప్రకటన అనంతరం మొజ్తాబా విడుదల చేసిన ప్రకటనను ఆ దేశ మీడియా చదివి వినిపించింది. 'ఇది యుద్ధం ముగింపునకు సంకేతం కాదు. మా వేళ్లు ఇంకా ట్రిగ్గర్ పైనే ఉన్నాయి. శత్రుదేశాలు ఏవిధంగానైనా దురాక్రమణకు పాల్పడితే.. పూర్తి బలంతో ధీటుగా స్పందిస్తాం' అని పేర్కొంది. తక్షణమే కాల్పులు నిలిపివేయాలని అన్ని సైనిక విభాగాలను సుప్రీం నేత ఆదేశించినట్లు వెల్లడించింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రతిపాదన మేరకు రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. హర్మ్యూజ్‌ను తెరిచేందుకు ఇరాన్ అంగీకరించిందని.. దీంతో రెండు వారాల పాటు దానిపై ఎలాంటి దాడులు చేయమని స్పష్టంచేశారు. ఇరాన్‌తో శాశ్వత శాంతి ఒప్పందానికి, పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి ఈ గడువు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. హర్మ్యూజ్ జలసంధిపై తమ నియంత్రణ కొనసాగించడం, అమెరికా విధించిన ప్రాథమిక ఆంక్షలు ఎత్తివేయడం, తమపై ఎలాంటి దురాక్రమణలకు పాల్పడకుండా ఉండటం వంటి 10 పాయింట్లను ఇరాన్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలు కూడా సానుకూలంగా ఉన్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇరాన్ కూడా ఈ కాల్పుల విరమణకు అంగీకారం తెలిపింది.

# మణిపూర్‌లో ఆగని హింసాకాండ



**హైదరాబాద్ పెన్ పవర్:** మణిపూర్‌లోని హింసాకాండ విరామం లేకుండా కొనసాగుతోంది. తాజాగా జరిగిన హింసకాండలో ఇద్దరు చిన్నారులతో సహా నలుగురు మృతి చెందారు. విష్ణుపూర్ జిల్లాలో మంగళవారం జరిగిన బాంబు దాడిలో ఇద్దరు పిల్లలు మృతి చెందారు. వారి తల్లి తీవ్రంగా గాయపడ్డారు. తెల్లవారు జామున ఒంటిగంట సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మోయిరంగ్ ట్రాంగ్లోబి ప్రాంతంలో ఒక ఇంటిపై మిలిటెంట్లుగా అనుమానిస్తున్న వ్యక్తులు బాంబు విసరడంతో ఐదేళ్ళ బాలుడు, ఆరుమాసాల చిన్నారి మరణించారు. ఘటన జరిగిన సమయంలో వారు వారి ఇంట్లోని పడకగదిలో నిద్రిస్తున్నారని పోలీసు అధికారి తెలిపారు. ఈ సంఘటనతో స్థానికులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారని పోలీసులు తెలిపారు. ఇది జరిగిన వెంటనే విష్ణుపూర్ జిల్లాలోని భద్రతా బలగాల శిబిరాన్ని స్థానికులు చుట్టుముట్టారు. ఆ శిబిరాన్ని ధ్వంసం చేశారు. దాంతో వారు జరిపిన కాల్పుల్లో ఐదుగురు గాయపడ్డారని, వీరిలో ఇద్దరు మృతి చెందారని అధికారులు తెలిపారు. అలాగే ఆ ప్రాంతంలోని రెండు చమురు ట్యాంకర్లను, ట్రక్కును తగలబెట్టారు. మోయిరంగ్ పోలీసుస్టేషన్ ఎదుట టైర్లను తగలబెట్టిన స్థానికులు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పోలీసు ఔట్‌పోస్టును ధ్వంసంచేశారు. దాంతో ఆ ప్రాంతంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భద్రతా బలగాలను మోహరించారు. ఇద్దరు మైనర్ల హత్యకు గురైన నేపథ్యంలో ద

ఆ ఏరియాలో వాహనాలరాకపోకలను అడ్డుకున్నారు. ఈ బాంబు దాడిలో అమాయకులైన పిల్లలు మరణించడాన్ని దారుణమైన చర్యగా ముఖ్యమంత్రి వై.ఖేమ్‌చంద్ వ్యాఖ్యానించారు. ఇందుకు కారకులైన వారిని కచ్చితంగా గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

# వియత్నాం అధ్యక్షుడిగా టో లామ్

**హైదరాబాద్ పెన్ పవర్:** వియత్నాం కమ్యూనిస్టు పార్టీ అధినేత టో లామ్ దేశాధ్యక్షుడిగా ఎన్ని కయ్యారు. జాతీయ అసెంబ్లీ ఆయనకు పూర్తి మద్దతు ప్రకటించింది. లామ్ జనవరిలో పార్టీ ప్రధాన కార్యదర్శిగా మరోసారి ఎన్నికైన విషయం తెలిసిందే. మంగళవారం ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన ప్రసంగిస్తూ 'పార్టీ ప్రధాన కార్యదర్శిగా, దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం ఒక గొప్ప గౌరవంగా భావిస్తాను. దీనిని బాధ్యతగా, పవిత్రంగా, ఉన్నతంగా నిర్వర్తిస్తాను' అని అన్నారు. జాతీయ అసెంబ్లీ సమావేశానికి హాజరైన డిప్యూటీలు అందరూ తీర్మానాన్ని సమర్థించి 2026–2031 కాలానికి లామ్‌ను దేశాధ్యక్షుడిగా ఎన్నుకున్నారని జాతీయ అసెంబ్లీ ఛైర్మెన్ థన్ మన్ తెలిపారు. వియత్నాం అధ్యక్షుడిగా, కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా?రెండు పదవులకూ ఎంపికైన తొలి వ్యక్తి లామ్. వియత్నాంలో పది శాతం వార్షిక వృద్ధి రేటు సాధించాలని, అదే సమయంలో పార్టీని బలోపేతం చేయాలని లామ్ నిర్దేశించుకున్నారు. ఈయన పదవీ కాలం ఐదేండ్లు (2026– 2031) కొనసాగుతుంది. ఈ విషయాన్ని వియత్నాం జాతీయ అసెంబ్లీ మంగళవారం ధృవీకరించినట్టు జిన్హువా న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది.



వియత్నాం అధ్యక్షుడిగా ఎన్నికైన టో లామ్‌కు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. టో లామ్ నాయకత్వంలో న్యూఢిల్లీ, హనోరు మధ్య సంబంధాలు మరింత బలపడతాయని మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'వియత్నాం సోషలిస్ట్ రిపబ్లిక్ అధ్యక్షుడిగా ఎన్నికైన టో లామ్‌కి నా హృదయ పూర్వక అభినందనలు. ఆయన నాయకత్వంలో భారత్– వియత్నాం దేశాల మధ్య కాలపరీక్షకు నిలిచిన స్నేహం మరింత బలపడుతుందని నేను దృఢంగా నమ్ముతున్నాను. మన ప్రజల ప్రాంతం పురోగతి, శ్రేయస్సు కోసం సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి, మీతో కలిసి పని చేయడానికి నేను ఎదురుచూస్తున్నాను' అని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ తర్వాత నిర్దిష్ట వర్గాల వ్యక్తుల పేర్లు తొలగించబడ్డాయి



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎస్ఐఆర్ తర్వాత విడుదలైన ఓటర్ల జాబితా నుండి కొన్ని నిర్దిష్ట వర్గాలకు చెందిన వ్యక్తుల పేర్లను తొలగించారని ఆ రాష్ట్ర సిఎం మమతా బెనర్జీ ఆరోపించారు. మంగళవారం నదియా జిల్లాలోని చక్దహాలో జరిగి ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ? ఓటర్ల జాబితా నుండి తొలగించిన వారికి తృణమూల్ కాంగ్రెస్ అండగా నిలుస్తుంది' అని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా నుంచి దాదాపు 91 లక్షల మంది ఓటర్లను తొలగించినట్లు ఎన్నికల సంఘం తాజా గణాంకాలు వెల్లడించాయి. ఈ విషయంపై తాను సుప్రీంకోర్టుని ఆశ్రయించానని, అత్యున్నత న్యాయస్థానం జోక్యంతో ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగించిన 60 లక్షల పేర్లలో 30 లక్షల పేర్లను తిరిగి చేర్చారని మమత అన్నారు. ఈ సందర్భంగా నిర్దిష్ట వర్గాలను లక్ష్యంగా చేసుకుని అధికారిక రికార్డుల నుంచి పేర్లను తొలగిస్తున్నారు అని మమతా ఆరోపించారు. కాగా, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29 తేదీల్లో జరగనున్నాయి. ఫలితాలు మే 4న విడుదల కానున్నాయి.

## మహిళలకు రూ.2వేల ఆర్థిక సాయం

### మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న ఖర్గే




**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మంగళవారం మ్యానిఫెస్టోను విడుదల చేసింది. మహిళలకు పీజీ వరకు ఉచిత విద్య, నెలకు రూ. 2,000 ఆర్థిక సహాయం, ఉచిత బస్సు ప్రయాణం అందిస్తామని పేర్కొంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏఐ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను నెలకొల్పుతామని, ప్రతి కుటుంబానికి రూ. 10 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని హామీ ఇచ్చింది. సన్నకారు, భూమి లేని రైతులకు ఏడాదికి రూ. 15,000 ఆర్థిక సాయం అందిస్తామని, సాగు పరికరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని పేర్కొంది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోల్‌కతాలో పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. గత 15 ఏళ్లుగా రాష్ట్ర అభివృద్ధికి తృణమూల్ కాంగ్రెస్ చేసింది తక్కువని, ఉద్యోగావకాశాలను కల్పించేందుకు పెట్టుబడులు పెట్టాల్సిన అవసరముందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. భాజపా ఇలాంటి విషయాలపై మాట్లాడదని, కానీ ప్రజలను విభజించేందుకు ప్రయత్నిస్తుందని ఎద్దేవా చేశారు.

## రెండు వారాల పాటు కాల్పుల విరమణ




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌పై అర్ధరాత్రి జరగాల్సిన దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సోషల్‌మీడియా వేదికగా ప్రకటించారు. రెండు వారాల పాటు కాల్పుల విరమణ అమల్లో ఉంటుందని తెలిపారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైన్యాధ్యక్షుడు ఆసిమ్ మునీర్‌తో చర్చల అనంతరం ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌పై ఈ రాత్రి జరగాల్సిన దాడులను నిలిపివేయాలని వారు చేసిన ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా చెప్పారు. హోర్ముజ్ జలసంధిని తక్షణమే తెరవాలన్న షరతుకు లోబడి రెండు వారాల గడువు ఇచ్చేందుకు, కాల్పుల విరమణకు అంగీకరించానని ట్రంప్ తెలిపారు. ఇరాన్ నుంచి 10 సూత్రాలతో ఒక ప్రతిపాదన అందిందని.. దానిపై సానుకూలంగా చర్చలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఉన్న వివాదాస్పద అంశాల్లో చాలా వాటిపై రెండు దేశాల మధ్య అంగీకారం కుదిరిందని తెలిపారు. ఈ రెండు వారాల వ్యయధిలో తుది ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాల్పుల విరమణపై అమెరికాకు మద్దతిస్తాం.. కానీ



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా– ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మద్దతిస్తామన్నారు. అయితే, ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టంచేశారు. నెతన్యాహు కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. హర్మ్యూజ్ జలసంధిని ఇరాన్ తిరిగి తెరవడం, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై దాడులు నిలిపివేయడం వంటి షరతులకు లోబడి.. రెండు వారాల కాల్పుల విరమణకు ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి మద్దతిస్తున్నట్లు పేర్కొంది. దీంతోపాటు ఇరాన్ అణు, క్షిపణి, ఉగ్రవాదం నుంచి ప్రపంచానికి ముప్పు కలగకుండా అమెరికా చేస్తున్న ప్రయత్నాలను సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్‌తో జరగబోయే చర్చల్లో.. యూఎస్, ఇజ్రాయెల్, దాని మిత్రదేశాల లక్ష్యాలను సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని అగ్రరాజ్యం తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. అయితే, ఈ కాల్పుల విరమణ లెబనాన్‌కు వర్తించదని తేల్చి చెప్పేసింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటన ఇందుకు విభిన్నంగా ఉంది. అమెరికా– ఇరాన్ అంగీకరించిన కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# భారతవృద్ధికి ముడి చమురు విఘాతం

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధంతో భగ్గుమంటున్న చమురు మంట భారత వృద్ధి రేటుకు విఘాతాన్ని కల్పించనుందని అంతర్జాతీయ ఫైనాన్షియల్ దిగ్గజం మోర్గన్ స్టాన్లే హెచ్చరించింది. ముడి చమురు ధరలు ఒక్క త్రైమాసికం పాటు బ్యారెల్‌కు 150 డాలర్లకు చేరితే ఆర్థిక సంవత్సరం 2026-27లో భారత వృద్ధి 5.7 శాతానికి పడిపోయే ప్రమాదం ఉందని విశ్లేషించింది. కరోనా మహమ్మారి తర్వాత భారత్ నమోదు చేసే అత్యల్ప వృద్ధిరేటు ఇదే అవుతుందని మంగళవారం విడుదల చేసిన చేసిన నివేదికలో తెలిపింది. ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ ధర ఇప్పటికే 111 డాలర్ల పైనే కొనసాగుతుండటం.. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి వద్ద నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ అంచనాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. చమురు ధరల పెరుగుదల దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీసే అవకాశం ఉంది. ఒకవేళ చమురు 150 డాలర్ల మార్కును తాకితే.. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ గరిష్ట పరిమితి అయిన 6 శాతం దాటిపోవచ్చని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. దీనికి తోడు కరెంట్ అకౌంట్ లోటు (సీఏడీ) కూడా జీడీపీలో 3 శాతానికి పెరిగే ముప్పు ఉంది. సాధారణ పరిస్థితుల్లో బ్రెంట్ క్రూడ్ సగటున 95 డాలర్ల అంచనాతో భారత జీడీపీని గతంలోని 6.5 శాతం నుంచి 6.2 శాతానికి తగ్గించింది. అలాగే ద్రవ్యోల్బణం అంచనాను 5.1 శాతానికి పెంచడం గమనార్హం. ఈ వృద్ధి మందగమనానికి ప్రధానంగా మూడు కారణాలను నివేదిక విశ్లేషించింది. ఇంధనం, ముడి సరుకుల ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం అధికమై తయారీ రంగంపై ప్రభావం పడుతుంది. రెండోది నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల సామాన్యుల కొనుగోలు శక్తి తగ్గి వినియోగం మందగిస్తుంది. ఇక మూడో




కారణం అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ప్రభావిత ప్రాంతాలకు ఎగుమతులు తగ్గడం. వెరసి, ముడిచమురు ధరల పెరుగుదల భారత ఆర్థిక వ్యవస్థపై బహుముఖ ప్రభావం చూపే అవకాశం ఉందని మోర్గాన్ స్టాన్లీ స్పష్టం చేసింది.

# ఇండియాలో యూరియా సంక్షోభం

మధ్యప్రాచ్య యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ప్రతీ దేశం పైనా, ప్రతీ రంగం మీదా పడింది. భారత్‌లోనూ ఇదే పరిస్థితి కనబడుతోంది. దేశంలో ప్రధాన ఎరువైన యూరి యా కొరత ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మోడీ సర్కారుకు ముందు చూపు లోపించడం కారణంగానే ఈ పరిస్థితి ఎదురువుతో ందని వివరిస్తున్నారు. అలాగే రైతులు యూరియా వినియోగం పెంచారనీ, పర్యవేక్షించాల్సిన యంత్రా ంగాలు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో యూరియా సంక్షోభం తీవ్రమై, అది ఆహార ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేంద్రంలోని మోడీ సర్కారు నిద్ర వీడి ప్రస్తుత సమస్యకు పరిష్కారం వెతకాలని సూచిస్తున్నారు. మధ్యప్రాచ్యంలో జరుగుతోన్న యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. అలాగే ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. చమురు, గ్యాస్ సరఫరాలో అంతరాయంతో పలు రంగాలు ప్రభావితమవుతున్నాయి. ముఖ్యంగా ఎల్‌ఎన్‌జీ సరఫరా తగ్గడంతో భారత్‌లో యూరియా ఉత్పత్తి దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక రైతులు ఎన్‌పీకే ఎరువుల సరైన నిష్పత్తిని పాటించడం లేదని అధికారులు చెప్తున్నారు. శాస్త్రీయంగా సరైన ఎరువు నిష్పత్తి 4:2:1 (నైట్రోజన్:ఫాస్పరస్:పొటాష్)గా ఉండాలి. ఇందులో నైట్రోజన్ భాగమే యూరియా. ఇది పంటలకు తక్షణ ఫలితాలు ఇస్తుంది కానీ



దీర్ఘకాలంలో నేల సారాన్ని తగ్గిస్తుంది. యూరియాలో 46 శాతం నైట్రోజన్ ఉంటుంది. భారత్‌లో రైతులు అధిక దిగుబడుల కోసం యూరియాను ఎక్కువగా వాడుతున్నారు. సరైన నిష్పత్తి 4:2:1 కాగా.. ప్రస్తుతం ఇది సగటున 9:3:1కి పెరిగింది. అంటే ప్రతీ ఒక కిలో పొటాష్‌కు రైతులు 9 కిలోలకు పైగా నైట్రోజన్‌ను వాడుతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఉదాహరణకు, నాగాలాండ్‌లో 1కిలో పొటాష్‌కు 101 కిలోల నైట్రోజన్ వాడుతున్నారు. తెలంగాణలో ఇది 12.6 కిలోలుగా ఉంది. నిపుణులు చెప్తున్నదాని ప్రకారం.. రైతులు అధిక యూరియా వాడడం వల్ల నేల నాణ్యత తగ్గింది. దీంతో మరింత యూరియా అవసరం అవుతోంది. ఎల్ఎన్‌జీ సరఫరా తగ్గడంతో యూరియా ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉంది. అందుకే, నిపుణులు నైట్రోజన్ వినియోగాన్ని 9.3 కిలలో నుంచి 4 కిలోలకు తగ్గించాలని సూచిస్తున్నారు. అయితే ఇది అమలు చేయడం సులభం కాదనీ, ఎందుకంటే నేల ఇప్పటికే నైట్రోజన్‌పై ఆధారపడే స్థితికి చేరుకుందని వారు చెప్తున్నారు.

# అమెరికా-ఇరాన్ సీస్‌ఫైర్..
# సెన్సెక్స్ 2,600, నిఫ్టీ 740 పాయింట్ల లాభం



దాదాపు రెండు నెలల పశ్చిమాసియా యుద్ధ మేఘాలు వీడి, అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ (అవజీబవటతితీవ) కుదిరిన విషయం తెలిసిందే. ఈ వార్తలతో దేశీయ స్టాక్‌మార్కెట్లు నేడు (ఏప్రిల్ 8, 2026) సరికొత్త రికార్డులను సృష్టించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాడులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం గ్లోబల్ ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని నింపింది. ఈ క్రమంలో సెన్సెక్స్ ఏకంగా 2,600 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ 740 పాయింట్ల భారీ పెరుగుదలతో 23,800 మార్కును అధిగమించింది. ఈ అసాధారణ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద కేవలం కొన్ని గంటల్లోనే లక్షల కోట్లు పెరిగింది.

ఈ భారీ లాభాలకు ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఒకేరోజు సుమారు 15% (సుమారు వి16) పడిపోయి, తిరిగి వి95 దిగువకు చేరుకోవడమే. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ అంగీకరించడంతో సరఫరా ఆటంకాలు తొలగుతాయన్న ఆశలు చిగురించాయి. దీనివల్ల పెయింట్స్, టైర్లు, ఆటోమొబైల్ మరియు ఏవియేషన్ రంగాల షేర్లు భారీగా లాభపడ్డాయి. ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లో జరగనున్న శాంతి చర్చలు సఫలమైతే, మార్కెట్లు మరిన్ని గరిష్ఠాలను తాకే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఐడీబీఐ బ్యాంక్‌లో వాటా విక్రయానికి సవరించిన ఆర్థిక బిడ్లు

ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటా విక్రయం కోసం నిర్ణయించిన రిజర్వ్ ధర కంటే, తక్కువ మొత్తం బిడ్లను 'సామర్థ్యం గల ఇద్దరు కొనుగోలుదారులు' వేసినందున.. ప్రభుత్వం వారి నుంచి సవరించిన ఆర్థిక బిడ్లను కోరే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటా విక్రయ ప్రక్రియ సాంకేతిక మూల్యాంకన దశలో ఉందని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో, అనిశ్చితుల ప్రభావం నుంచి మనదేశ ఆర్థిక వ్యవస్థను కాపాడే చర్యల కోసం వనరులను సమీకరించడానికి, ద్రవ్యపరమైన వెసులుబాటు కల్పించుకోవడానికి.. ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణపై ఆధారపడుతోందని అధికారులు వెల్లడించారు. మూడేళ్లకు పైగా సాగిన ప్రయత్నాల తర్వాత, ఐడీబీఐ బ్యాంక్ వ్యూహాత్మక వాటా విక్రయ ప్రక్రియ ఆర్థిక బిడ్ల తుది దశకు చేరుకుంది. విక్రయాన్ని త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్న ప్రభుత్వం, ఈ ప్రక్రియ మొత్తాన్ని మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాలనుకోవడం లేదు. అందువల్ల ఇప్పటికే ముందుకు వచ్చిన ఇద్దరు కొనుగోలుదార్లను, ఆర్థిక బిడ్లు సవరించి దాఖలు చేయమని కోరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఐడీబీఐ బ్యాంక్‌లో వాటా విక్రయానికి ప్రభుత్వం 2022 అక్టోబరులో ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)ను వివిధ సంస్థల నుంచి కోరింది.




ప్రస్తుతం ఐడీబీఐలో ప్రభుత్వం (45.48%), ఎల్ఐసీ (49.24%)కి వాటాలు ఉన్నాయి.

## భారీగా తగ్గిన చమురు ధరలు



ఇరాన్‌పై తలపెట్టిన సైనిక దాడులను రెండు వారాల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లపై తక్షణ ప్రభావం పడింది. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ భయాలు తాత్కాలికంగా తొలగిపోవడంతో ముడి చమురు ధరలు భారీగా పడిపోయాయి. స్టాక్ మార్కెట్లు సానుకూలంగా స్పందించాయి. గత కొన్ని వారాలుగా హర్మూజ్ జలసంధి వద్ద నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా పెరుగుతూ.. వచ్చిన ముడి చమురు ధరలు, ట్రంప్ ప్రకటనతో 100 డాలర్ల కంటే దిగువకు పడిపోయాయి. హర్మూజ్ జలసంధిని ఇరాన్ తిరిగి తెరవాలనే షరతుపై దాడులను నిలిపివేస్తున్నట్లు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' లో వెల్లడించారు. అమెరికా ప్రధాన సూచీల ఫ్యూచర్స్ 2 శాతానికి పైగా పెరిగాయి. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఇరాన్ ఆంక్షలు విధించడంతో సరఫరాపై ఆందోళనలు పెరిగి ధరలు పెరిగాయి. తాజా పరిణామాలతో అమెరికా మార్కెట్లతో పాటు జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పి సూచీలు పుంజుకున్నాయి.

## రెపో రేటు యథాతథం
## ఈఎంఐలపై ఉపశమనం లేదు




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతూ రెపో రేటును 5.25 శాతం వద్ద కొనసాగించాలని ద్రవ్య విధాన కమిటీ నిర్ణయించింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మాంద్యంలోకి నెడుతున్నప్పటికీ వడ్డీ రేట్లలో తగ్గింపు లేకపోవడం నిరాశ కలిగించింది. ఈ కమిటీకి ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వం వహిస్తున్నారు. ఈ నిర్ణయంతో గృహ రుణాలు, వ్యక్తిగత రుణాలపై ఈఎంఐలు తగ్గే అవకాశాలు తగ్గిపోయాయి. వడ్డీ రేట్లలో కోత కోసం ఎదురుచూస్తున్న సామాన్యులకు ఇది నిరాశ కలిగించే అంశంగా మారింది.కార్పొరేట్ ప్రయోజనాలను పరిరక్షించే కేంద్ర విధానాలు కొనసాగుతున్నప్పటికీ, సామాన్యుడి కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం చూపే వడ్డీ భారాన్ని తగ్గించడంలో ఆర్‌బిఐ విఫలమవుతోంది. విదేశీ మార్కెట్లలో ఉన్న అనిశ్చితి భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రాబోయే నెలల్లో ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇక రూపాయి విలువ పడిపోకుండా నియంత్రించడం కూడా ఆర్‌బిఐ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అదే సమయంలో ద్రవ్యోల్బణాన్ని 2 నుంచి 6 శాతం పరిధిలో (4 శాతం లక్ష్యంతో) నియంత్రించడానికి చర్యలు కొనసాగుతున్నాయి.

## ఐపీఓ అనుమతుల చెల్లుబాటు
## గడువు పొడిగించిన సెబీ




తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)ల నిర్వహణకు ఇచ్చిన అనుమతుల చెల్లుబాటు గడువును సెప్టెంబరు 30 వరకు సెబీ పొడిగించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల, మార్కెట్లు ఒడుదొడుకులకు లోనవుతుండటంతో పలు కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను వాయిదా వేయాలని యోచిస్తున్నాయి. సెబీ తీసుకున్న తాజా నిర్ణయంతో ఇలాంటి కంపెనీలకు ప్రయోజనం కలగనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి 2026 సెప్టెంబరు 30 మధ్య ముగియనున్న ఐపీఓ నిర్వహణ అనుమతుల చెల్లుబాటు సమయాన్ని, 2026 సెప్టెంబరు 30 వరకు పొడిగిస్తున్నట్లు సెబీ తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 మధ్య, కనీస ప్రజల వాటా నిబంధనలను పాటించాల్సిన గడువు ముగియనున్న కంపెనీలపైనా ఎలాంటి చర్యలు చేపట్టబోమని తెలిపింది. కొవిడ్-19 పరిణామాల సమయంలోనూ ఇదే తరహా ఉపశమన చర్యలను సెబీ చేపట్టింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. సెబీ అనుమతులు లభించాక 12 లేదా 18 నెలల్లోగా పబ్లిక్ ఇష్యూను కంపెనీలు నిర్వహించాలి. పశ్చిమాసియా అనిశ్చితుల్లో మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతుండటంతో, కేపిటల్ మార్కెట్ల నుంచి నిధుల సమీకరణ, 25% కనీస ప్రజల వాటా నిబంధన పాటింపు విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సెబీకి పలువురు విన్నవించారు. దీనిని పరిగణనలోకి తీసుకుని, ఐపీఓ అనుమతుల చెల్లుబాటు గడువును పెంచాలని సెబీ నిర్ణయించింది.

# మహిళలు రాత్రిపూట కాఫీ తాగితే ఇన్ని జరుగుతాయా



రాత్రి వేళల్లో పని ఒత్తిడిని తగ్గించుకోవడానికో లేదా నిద్రను తరిమికొట్టడానికో మీరు కాఫీ తాగుతున్నారా? అయితే జాగ్రత్త.. ఆ కాఫీ కప్పు కేవలం మీ నిద్రనే కాదు, మీ ప్రవర్తనను కూడా మార్చేస్తోంది. రాత్రిపూట కెఫీన్ తీసుకోవడం వల్ల మెదడు తన నియంత్రణను కోల్పోయి, ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకునేలా ప్రేరేపిస్తుందని తాజా పరిశోధనల్లో వెల్లడైంది. చాలా మందికి రాత్రి వేళల్లో పని చేసేటప్పుడో లేదా చదువుకునేటప్పుడో కాఫీ తాగడం అలవాటు. కాఫీలోని కెఫీన్ మనల్ని ఉత్సాహంగా ఉంచుతుందని భావిస్తాం. అయితే రాత్రిపూట కెఫీన్ తీసుకోవడం వల్ల నిద్ర పట్టకపోవడమే కాకుండా మన ప్రవర్తనలో ఆవేశం పెరుగుతుందని, ముఖ్యంగా మహిళల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని తాజా పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఎల్ పాసోలోని టెక్సాస్ విశ్వవిద్యాలయం పరిశోధకులు నిర్వహించిన ఈ అధ్యయనం ఐసైన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. ఈ పరిశోధన ప్రకారం.. రాత్రిపూట కెఫీన్ తీసుకున్నప్పుడు మెదడు తనను తాను నియంత్రించుకునే శక్తిని కోల్పోతుంది. దీనివల్ల ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకోవడం, రిస్క్ తీసుకోవడం వంటి ఆవేశపూరిత ప్రవర్తన పెరుగుతుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఇదే కెఫీన్‌ను పగటిపూట తీసుకున్నప్పుడు ప్రవర్తనలో ఎటువంటి మార్పులు కనిపించలేదు. అంటే కెఫీన్ తీసుకునే సమయం మన మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ అధ్యయనంలో ఒక కీలక వ్యత్యాసం వెలుగుచూసింది. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ ఆవేశపూరిత ప్రవర్తన చాలా ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీనికి కారణాలు ఏంటంటే.. స్త్రీల శరీరంలోని హార్మోన్లు, జీవక్రియలు కెఫీన్‌కు భిన్నంగా స్పందిస్తాయి. కెఫీన్ వల్ల మెదడులో విడుదలయ్యే డోపమైన్, నోర్‌అడ్రినాలిన్ వంటి రసాయనాలు మహిళల ప్రవర్తనపై ఎక్కువ ప్రభావం చూపుతాయి. సాధారణంగా మెదడులో అడెనోసిన్ అనే రసాయనం మనల్ని విశ్రాంతి వైపు నడిపిస్తుంది. కెఫీన్ ఈ అడెనోసిన్‌ను అడ్డుకుని మెదడును అతిగా ఉత్తేజపరుస్తుంది. శరీరం విశ్రాంతికి సిద్ధమయ్యే రాత్రి సమయంలో ఇలా అతిగా ఉత్తేజం చెందడం వల్ల విచక్షణ, భావోద్వేగ నియంత్రణ దెబ్బతింటాయి. దీనివల్ల ఆర్థికపరమైన తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం, డ్రైవింగ్‌లో అజాగ్రత్తగా ఉండటం వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

# ఆయుష్షును మింగేస్తున్న కంప్యూటర్స్



ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కండరాలు బలహీనపడి, వెన్నెముకపై ఒత్తిడి పెరుగుతుంది. దీనివల్ల నడుము నొప్పి వస్తుంది. రక్త ప్రసరణ మందగించడం వల్ల చేతులు, కాళ్ళలో వాపు కూడా వస్తుందని డాక్టర్ అజయ్ కుమార్ అంటున్నారు. కాబట్టి ఇలాంటి సమస్యలను నివారించడానికి కొన్ని చిట్కాలను పాటించడం చాలా ముఖ్యం. నేటి జీవనశైలిలో ఆఫీసు పని, వర్క్‌ఫ్రం హోం, ఆన్‌లైన్ చదువులతో గంటల తరబడి ఒకేచోట కూర్చోవడం సర్వసాధారణమై పోయింది. దీంతో నిరంతరం కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్ ముందు కూర్చుంటున్నారు. కానీ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ అలవాటును నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్యానికి హానికరమని హెచ్చరిస్తున్నారు. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కండరాలు బలహీనపడి, వెన్నెముకపై ఒత్తిడి పెరుగుతుంది. దీనివల్ల నడుము నొప్పి వస్తుంది. రక్త ప్రసరణ మందగించడం వల్ల చేతులు, కాళ్ళలో వాపు కూడా వస్తుందని డాక్టర్ అజయ్ కుమార్ అంటున్నారు. కాబట్టి ఇలాంటి సమస్యలను నివారించడానికి కొన్ని చిట్కాలను పాటించడం చాలా ముఖ్యం. ఈ రకమైన అలవాటు బరువు పెరగడం, గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. అంతేకాకుండా జీవక్రియ మందగించడం వల్ల కేలరీలు సరిగ్గా ఖర్చు కాకపోవచ్చు. అదనంగా, నిరంతరం కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్ చూడటం వల్ల కళ్లపై ఒత్తిడి పెరిగి దృష్టి సమస్యలు వస్తాయి. ఇది మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. దీనివల్ల చంచలత్వం, పనిపై శ్రద్ధ తగ్గడం వంటివి కలుగుతాయని ఆయన అంటున్నారు.

# మోకాళ్లు, మోచేతుల దగ్గర నలుపు ఇబ్బందిపెడుతోందా?



చాలామంది ముఖంపై చూపించినంత శ్రద్ధ మోకాళ్లు, మోచేతులపై చూపించరు. ఫలితంగా అక్కడ చర్మం గరుకుగా, నల్లగా మారుతుంది. మోకాళ్లు, మోచేతుల దగ్గర చర్మం మందంగా ఉండటం వల్ల అక్కడ నలుపు త్వరగా పేరుకుపోతుంది. ఇది మనం పొట్టి దుస్తులు వేసుకున్నప్పుడు ఇబ్బందికరంగా అనిపించవచ్చు. అయితే, ఖరీదైన క్రీములు వాడకుండానే వంటింట్లో ఉండే పదార్థాలతో ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చని మీకు తెలుసా..? చర్మంపై ఉండే ఈ నలుపును కేవలం ఏడు రోజుల్లోనే తగ్గించుకోవడానికి కొన్ని సులభమైన మార్గాలు ఇక్కడ ఉన్నాయి. నిమ్మకాయ, చక్కెర: నిమ్మకాయను సగానికి కోసి దానిపై కొంచెం చక్కెర చల్లాలి. దీనిని మోకాళ్లు, మోచేతులపై వృత్తాకారంలో 5-10 నిమిషాల పాటు మెల్లగా రుద్దాలి. నిమ్మలోని సిట్రిక్ యాసిడ్ నలుపును వదిలిస్తే, చక్కెర చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. కలబంద, పాలు: కలబంద గుజ్జుకు కొంచెం పాలు కలిపి నల్లగా ఉన్న చోట రాయాలి. రాత్రంతా అలాగే ఉంచి ఉదయాన్నే కడిగేయాలి. కలబంద చర్మానికి తేమను ఇస్తుంది, పాలు చర్మం రంగును మెరుగుపరుస్తాయి. కొబ్బరి నూనె, నిమ్మరసం: కొబ్బరి నూనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి ప్రతిరోజూ స్నానానికి ముందు మసాజ్ చేయాలి. కొబ్బరి నూనెలో ఉండే విటమిన్ ఇ చర్మాన్ని రిపేర్ చేస్తుంది. నలుపును క్రమంగా తగ్గిస్తుంది. బేకింగ్ సోడా, పాలు: ఒక స్పూన్ బేకింగ్ సోడాకు తగినన్ని పాలు కలిపి పేస్ట్‌లా చేయాలి. దీనిని రాసి ఆరిన తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. ఇది చర్మంపై ఉన్న మృతకణాలను తొలగించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. బంగాళాదుంప : బంగాళాదుంప ముక్కను తీసుకుని నల్లగా ఉన్న ప్రాంతంలో రుద్దాలి లేదా దాని రసాన్ని రాసి 15 నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇందులో ఉండే క్యాటకోలేస్ అనే ఎంజైమ్ చర్మాన్ని తెల్లగా మార్చడానికి తోడ్పడుతుంది.

# ప్రతిరోజూ చెవులు శుభ్రం చేస్తున్నారా?




మనం మన శరీరాన్ని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, చెవులను కూడా అలాగే ఉంచుకోవాలని అనుకుంటాం. చెవిలో కొద్దిగా గుబిలి కనిపించినా వెంటనే కాటన్ బడ్స్ లేదా పిన్నులతో తీసేస్తుంటాం. అయితే, ఈ అలవాటు వల్ల చెవికి మేలు కంటే కీడే ఎక్కువ జరుగుతుందని తెలిస్తే షాక్ అవుతారు. ప్రతిరోజూ చెవులను శుభ్రం చేసుకోవడం లేదా చెవిలో గుబిలిని తొలగించడం వల్ల కలిగే నష్టాల గురించి వైద్యులు హెచ్చరిస్తున్నారు. మనం శుభ్రత అనుకునే ఈ అలవాటు నిజానికి చెవి ఆరోగ్యానికి హానికరంగా మారవచ్చునని అంటున్నారు. చెవి గులిమి అనేది ఒక సహజ ప్రక్రియ. మన శరీరంలో దీనికి ఒక ముఖ్యమైన విధి ఉంది. పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించే చాలా మంది తమ చెవులను శుభ్రం చేసుకుంటారు. కొందరు వారానికి ఒకసారి ఇలా చేస్తే, మరికొందరు ప్రతిరోజూ చేస్తారు. చాలా మంది ఖాళీగా కూర్చున్నప్పుడు చెవులు శుభ్రం చేసుకోవడాన్ని ఆనందిస్తారు. కొందరు చెవులను శుభ్రం చేసుకోవడానికి నూనె వేసుకుంటే, మరికొందరు ఇయర్‌బడ్స్‌ను ఉపయోగిస్తారు. కొందరు అగ్గిపుల్ల చుట్టూ దూదిని చుట్టి దానితో చెవులను శుభ్రం చేసుకుంటారు. శరీరం ఎలాగైతే శుభ్రంగా ఉండాలో, చెవులు కూడా అలాగే శుభ్రంగా ఉండాలని ప్రజలు నమ్ముతారు. చాలామంది గులిమిని ఒక మురికిలా భావిస్తారు. కానీ అది చెవికి ఒక సెక్యూరిటీ గార్డు లాంటిది. ఇది చెవి లోపలి భాగాన్ని తేమగా ఉంచుతుంది. బాహ్య కారకాలైన దుమ్ము, పురుగులు, వైరస్లు లోపలికి వెళ్లకుండా అడ్డుకుంటుంది. ఇందులో ఉండే యాంటీ బాక్టీరియల్ గుణాలు ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తాయి. పదేపదే శుభ్రం చేయడం వల్ల తీవ్రమైన నష్టాలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. ఒక్కోసారి కాటన్ బడ్స్ వాడటం వల్ల గుబిలి బయటకు రాకపోగా, అది కర్ణభేరి వైపు నెట్టబడుతుంది. దీనివల్ల వినికిడి తగ్గడం లేదా చెవిలో శబ్దాలు రావడం జరుగుతుంది. అంతేకాదు.. చెవి లోపలి చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. పదునైన వస్తువులు లేదా బడ్స్ వల్ల అక్కడ చిన్న గాయాలు ఏర్పడి, ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దారితీయవచ్చు. మనం మాట్లాడేటప్పుడు లేదా ఆహారం నమిలేటప్పుడు దవడల కదలిక ద్వారా పాత గులిమి సహజంగానే బయటకు వచ్చేస్తుంది. మనం బలవంతంగా తీయాల్సిన అవసరం లేదు. స్నానం చేసిన తర్వాత చెవి బయటి భాగాన్ని మెత్తని తువ్వాలుతో తుడుచుకుంటే సరిపోతుంది. చెవి లోపల ఏదైనా వస్తువును చొప్పించకండి. ఒకవేళ చెవిలో గులిమి పేరుకుపోయి నొప్పిగా ఉంటే లేదా వినికిడి ఇబ్బందిగా ఉంటే, సొంత ప్రయోగాలు చేయకుండా ఇఎన్‌టి డాక్టరును సంప్రదించి ఇయర్ డ్రాప్స్ వాడటం ఉత్తమం. అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్లుగా, శుభ్రత విషయంలో కూడా అతిగా ప్రవర్తించడం చెవికి శాశ్వత నష్టాన్ని కలిగించవచ్చు. సహజ సిద్ధమైన ప్రక్రియను గౌరవించడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# మిల్‌మేకర్ బిర్యానీని ఇలా చేస్తే.. మటన్ బిర్యానీ కూడా బలాదూర్!



బిర్యానీ అంటే ఇష్టపడని వారు ఎవరుంటారు? అది వెజ్ అయినా, నాన్ వెజ్ అయినా ఆ సువాసనకే నోరూరుతుంది. సాధారణంగా మాంసాహారం తినని వారు లేదా అప్పుడప్పుడు వెరైటీగా ఏదైనా తినాలనుకునే వారికి మీల్‌మేకర్ (సోయా చంక్స్) ఒక అద్భుతమైన ఆప్షన్. మీల్‌మేకర్లను సరిగ్గా ఉడికించి, సరైన మసాలాలు జోడిస్తే అది రుచిలో మటన్ బిర్యానీని తలపిస్తుంది. అందుకే దీనిని చాలా మంది 'వెజ్ మటన్' అని కూడా పిలుస్తుంటారు. ఈ మీల్‌మేకర్ బిర్యానీ కేవలం రుచిలోనే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. పిల్లల లంచ్ బాక్స్‌లోకి గానీ, అతిథులు వచ్చినప్పుడు తక్కువ సమయంలో స్పెషల్ వంటకం చేయాలన్నా ఈ రెసిపీ బెస్ట్ ఛాయిస్.

కావలసిన పదార్థాలు: ఒక కప్పు మీల్‌మేకర్, ఒక కప్పు బాస్మతి బియ్యం, కూరగాయల్లో ఒక పెద్ద ఉల్లిపాయ, ఒక టమోటా, రెండు పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్ (1/2 టీస్పూన్), నెయ్యి, నూనె (తలా 2 టేబుల్ స్పూన్లు), బిర్యానీ ఆకు, జీలకర్ర పొడి, సోంపు పొడి, నల్ల మిరియాల పొడి, లవంగాల పొడి, దాల్చిన చెక్క పొడి (అన్నీ పావు టీస్పూన్ చొప్పున), పుదీనా, కొత్తిమీర ఆకులు,

తయారీ విధానం.. బిర్యానీ పర్ఫెక్ట్‌గా రావాలంటే ముందుగా బాస్మతి బియ్యాన్ని కడిగి ఒక గంట పాటు నానబెట్టుకోవాలి. మీల్‌మేకర్లను వేడి నీటిలో కొద్దిగా ఉప్పు వేసి నానబెట్టి, ఆ తర్వాత గట్టిగా పిండి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ప్రెషర్ కుక్కర్‌లో నూనె, నెయ్యి వేసి బిర్యానీ ఆకులు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి వేయించాలి. ఉల్లిపాయలు బంగారు రంగులోకి వచ్చాక అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఆపై టమోటా ముక్కలు వేసి అవి మెత్తబడే వరకు ఉడికించాలి.

టమోటాలు ఉడికిన తర్వాత పుదీనా, కొత్తిమీర ఆకులను చేర్చాలి. ఇప్పుడు అసలైన రహస్యం.. జీలకర్ర, సోంపు, మిరియాలు, లవంగాలు దాల్చిన చెక్క పొడులను వేసి బాగా కలపాలి. ఈ మసాలాల కలయికే మీల్‌మేకర్‌కు మటన్ రుచిని ఇస్తుంది. మసాలాలు వేగాక అవసరమైనంత నీరు పోసి మరిగించాలి. నీళ్లు మరుగుతున్నప్పుడు నానబెట్టిన బాస్మతి బియ్యం, సిద్ధం చేసుకున్న మీల్‌మేకర్లు తగినంత ఉప్పు వేసి ఒకసారి కలపాలి. అన్నీ కలిపిన తర్వాత ప్రెషర్ కుక్కర్ మూత పెట్టి, కేవలం ఒకే ఒక విజిల్ వచ్చే వరకు ఉంచాలి. స్టవ్ ఆపివేసి ప్రెషర్ అంతా దానంతట అదే పోయే వరకు వేచి ఉండాలి. మూత తెరిచి చూస్తే ఘుమఘుమలాడే మీల్‌మేకర్ బిర్యానీ రెడీ! దీనిని వేడివేడిగా ప్లేటులో వడ్డించి, ఉల్లిపాయ పెరుగు పచ్చడితో (రైతా) తింటే రుచి అద్భుతంగా ఉంటుంది. మటన్ ముక్కల్లాంటి మీల్‌మేకర్లు ప్రతి ముద్దలోనూ మీకు ఒక కొత్త అనుభూతిని ఇస్తాయి.

# వాషింగ్ మెషీన్‌లో ఇటువంటి బట్టలు వేయొద్దు



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో వాషింగ్ మెషీన్ ఇంటి పనులను ఎంతగానో సులభతరం చేస్తోంది. ఎన్ని బట్టలు ఉన్నా, తక్కువ సమయంలో ఎటువంటి శ్రమ లేకుండా ఉతికేయవచ్చు. అయితే వాషింగ్ మెషీన్ ఉంది కదా అని అన్ని రకాల వస్త్రాలను అందులో వేయడం అస్సలు మంచిది కాదు. కొన్ని రకాల బట్టలను మెషీన్‌లో ఉతకడం వల్ల బట్టలు పాడవ్వడమే కాకుండా మీ వాషింగ్ మెషీన్ కూడా త్వరగా రిపేర్లకు వచ్చే అవకాశం ఉంది. రెయిన్‌కోట్లు: రెయిన్‌కోట్లు వాటర్ ప్రూఫ్ పదార్థంతో తయారవుతాయి. వీటిని మెషీన్‌లో వేసినప్పుడు నీరు లోపలికి వెళ్లక అవి బెలూన్‌లా ఉబ్బి చిరిగిపోయే ప్రమాదం ఉంది. ఇది మెషీన్ బ్యాలెన్స్‌ను కూడా దెబ్బతీస్తుంది. ముత్యాలు, స్ఫటికాలు ఉన్న దుస్తులు: ముత్యాలు, పగడాలు లేదా పూసల పని ఉన్న ఖరీదైన దుస్తులను మెషీన్‌లో వేయకూడదు. మెషీన్ తిరుగుతున్నప్పుడు కలిగే రాపిడికి ఆ అలంకరణలు ఊడిపోవడమే కాకుండా బట్టల దారాలు బయటకు వచ్చేస్తాయి. అంతేకాదు ఆ ఊడిపోయిన పూసలు మెషీన్ డ్రమ్‌లో చిక్కుకుని మెషీన్‌ను పాడు చేస్తాయి. సున్నితమైన ఉన్ని దుస్తులు: ఉన్ని బట్టలు చాలా మృదువుగా ఉంటాయి. వీటిని మెషీన్‌లో వేస్తే వాటి ఆకారం దెబ్బతిని, సాగిపోయే అవకాశం ఉంది. అందుకే వీటిని తక్కువ సబ్బుతో సున్నితంగా చేతితో ఉతకడం లేదా డ్రై క్లీనింగ్ చేయించడం ఉత్తమం. నూనె, గ్రీజు మరకలు ఉన్న బట్టలు: వంట నూనె, పెట్రోల్, ఆల్కహాల్ లేదా మోటార్ గ్రీజు వంటి మరకలు ఉన్న బట్టలను నేరుగా వాషింగ్ మెషీన్‌లో వేయడం ప్రమాదకరం. ఇవి మండే స్వభావం కలవి కాబట్టి, మెషీన్ లోపల ఘర్షణ వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఇలాంటి బట్టలను ముందుగా చేతితో శుభ్రం చేశాకే మెషీన్‌లో వేయాలి. ప్యాడ్‌లు లేదా మెటల్ వైర్లు ఉన్న ఖరీదైన బ్రాలను మెషీన్‌లో వేయకూడదు. మెషీన్ రొటేషన్ వల్ల వాటి ఆకారం మారిపోవడమే కాకుండా వైర్లు బయటకు వచ్చి బట్టలను చింపివేస్తాయి. ఇది మెషీన్ డ్రమ్‌కు కూడా హానికరం. లేస్ వర్క్ ఉన్న బట్టలు చాలా సున్నితంగా ఉంటాయి. మెషీన్ ఫోర్స్‌కు లేస్ చిరిగిపోయి బట్టల అందం పాడవుతుంది.

### ఒప్పుకుంటున్నా.. మా బౌలర్లను బుడ్డోడు వణికించిండు:

# సూర్యవంశీపై ముంబై కోచ్ ప్రశంసలు



**హైదరాబాద్ పెన్ పవర్:** 15 ఏళ్ల యంగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ముంబై ఇండియన్స్?పై ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. మంగళవారం (ఏప్రిల్ 7) గౌహతి వేదికగా జరిగిన ఈ మ్యాచులో ముంబైపై కేవలం 14 బంతుల్లోనే 39 రన్స్ చేసి రాజస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా ప్రపంచ మేటి బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్?లో ఒకే ఓవర్లో రెండు సిక్సులు కొట్టి అందరిని ఔరా అనిపించాడు ఈ ఏళ్ల చిచ్చర పిడుగు. ప్రత్యర్థి జట్టు హెడ్ కోచే స్వయంగా వైభవ్?కు కితాబు ఇచ్చాడంటే అతడి బ్యాటింగ్ ఏ విధంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు.

ముంబై, రాజస్థాన్ మ్యాచ్ అనంతరం ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేల జయవర్ధనే వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ ఎదుగుదల చూడటం చాలా ఉత్సాహంగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రాపై సూర్యవంశీ చూపిన పట్టుదల అందరి దృష్టిని ఆకర్షించిందని కొనియాడాడు. వైభవ్ తన డేరింగ్ అండ్ డాషింగ్ బ్యాటింగ్?తో ముంబై బౌలర్లు ఇబ్బంది పెట్టాడని జయవర్ధనే ఒప్పుకున్నాడు.

లాస్ట్ ఇయర్ ఐపీఎల్?లోనే అతడి టాలెంట్ ఏంటో ప్రపంచానికి తెలిసిపోయిందన్నాడు. వైభవ్ దగ్గర మంచి స్కిల్ ఉందంటూ అతని ఆత్మవిశ్వాసాన్ని, అగ్రశ్రేణి బౌలింగ్‌ను ఎదుర్కొనే సామర్థ్యాన్ని ప్రశంసించారు. యశస్వీ జైశ్వాల్ కూడా ముంబైపై అద్భుతంగా బ్యాటింగ్ చేశాడని అన్నారు. మొదటి మూడు ఓవర్లలో అతను బ్యాటింగ్ చేసిన తీరు అద్భుతమని.. చాలా చక్కటి షాట్లు ఆడాడని ప్రశంసించారు. ఐపీఎల్ 19వ సీజన్లో రాజస్తాన్ రాయల్స్ హవా కొనసాగుతోంది. మెగా టోర్నీలో వరుసగా మూడో మ్యాచ్లోనూ రాయల్స్ విజయం అందుకుంది. మంగళవారం వర్షం అంతరాయం కలిగించిన పోరులో యశస్వి జైస్వాల్ (32 బాల్స్లో 40 ఫోర్లు, 4 సిక్సర్లతో 77 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఆర్ఆర్ 27 రన్స్ తేడాతో ముంబై ఇండియన్స్ను ఓడించింది. ఆడిన మూడు మ్యాచ్లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్కు చేరుకుంది. 11 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి తొలుత బ్యాటింగు వచ్చిన రాజస్తాన్ 150/3 స్కోరు చేసింది.వైభవ్ సూర్యవంశీ (14 బాల్స్లో 1 ఫోర్, 5 సిక్సర్లతో 39) కూడా దంచికొట్టాడు. అనంతరం ఛేజింగ్లో ముంబై 11 ఓవర్లలో 123/9 స్కోరు మాత్రమే చేసి ఓడిపోయింది. షెర్ఫానే రూథర్ఫర్డ్ (8 బాల్స్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25), నమన్ ధీర్ (13 బాల్స్లో 3 ఫోర్లు, 1 సిక్స్ 25) టాప్ స్కోరర్లు. రవి బిష్ణోయ్, సందీప్ శర్మ, బర్గర్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. జైస్వాల్కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

# కోట్ల రూపాలు తీసుకునే ముందే తెల్వదా: ఓవర్సీస్ ప్లేయర్లపై గవాస్కర్ ఫైర్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఫారెన్ ప్లేయర్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఫ్రాంచైజీలు పోటీ పడి మరీ కోట్లు కుమ్మరించి ఓవర్సీస్ ఆటగాళ్లను కొనుగోలు చేస్తాయి. కానీ కోట్ల జీతం తీసుకుంటున్నా విదేశీ ఆటగాళ్లు కొందరు లీగ్?కు అందుబాటులో ఉండటం లేదు. కొందరు వేలంలో పాల్గొని ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాక మేం ఆడమని చెబుతున్నారు. ఇంకొందరు లీగ్ స్టార్ట్ అయ్యాక వివిధ కారణాలతో టోర్నీ నుంచి వైదొలుగుతున్నారు. వీళ్ల తీరుతో జట్టు సమతుల్యం దెబ్బతిని ఆయా ఫ్రాంచైజీలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ క్రమంలో ఓవర్సీస్ ప్లేయర్ల తీరుపై భారత మాజీ క్రికెటర్ గవాస్కర్ ఫైర్ అయ్యారు. తమ హెల్త్ కండిషన్ ఎలా ఉంది..? టోర్నీకి పూర్తిగా అందుబాటులో ఉంటామా లేదా అనే విషయం ఆటగాళ్లకు ముందే తెలియదా అని ప్రశ్నించారు. తమకు చేతకాదని తెలిసినప్పుడు టోర్నీలో ఆడతామని రావడం ఎందుకని నిలదీశారు. టీ20ల్లో ఒక బౌలర్ కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే వేస్తాడని.. ఆ నాలుగు ఓవర్లు వేసేందుకు కూడా శరీరం సహకరించపోతే క్రికెట్ ఆడటం కన్నా రెండు నెలలు రెస్ట్ తీసుకోవడమే మంచిదని చురకలంటించారు. అంతేకానీ కోట్లకు కోట్ల రూపాయలు జీతం తీసుకుంటూ ఫ్రాంచైజీలను ఇబ్బంది పెట్టడం సబబు కాదని అన్నారు. ఒక ఆటగాడికి దేశమే ముఖ్యం ఇందులో ఎలాంటి సందేహం లేదు.. కానీ కోట్ల రూపాయలు తీసుకుంటున్న ఫ్రాంచైజీల పట్ల కూడా నిబద్ధత చూపించాలి కదా అని అన్నారు. షెడ్యూల్ అడ్జస్ట్?మెంట్ కాకపోతే మొత్తం టోర్నీకి దూరంగా ఉంటే ఎవరికీ ప్రాబ్లమ్ ఉండదని.. కానీ ఫ్రాంచైజీలు కొనుగులు చేసిన తర్వాత మధ్యలోనే వదిలి వెళ్లడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. కొన్ని దేశాల క్రికెట్ బోర్డులు ఐపీఎల్ ఆడేందుకు ఆటగాళ్లకు ఎన్వోసీ ఇవ్వకపోవడంపై కూడా గవాస్కర్ సీరియస్ అయ్యారు. ప్రతి విదేశీ ఆటగాడి ఐపీఎల్ జీతంలో 10% ఫీజును ఆయా దేశాల క్రికెట్ బోర్డులు తీసుకుంటాయి. ప్రపంచంలోని మరే ఇతర టీ20 లీగ్‌లోనూ ఇలాంటి నిబంధన లేదు. ఐపీఎల్ కేవలం విదేశీ ఆటగాళ్లకే కాకుండా వారి బోర్డులకు కూడా కాసుల పంట పండిస్తున్నప్పుడు టోర్నీలో ఆడేందుకు ఎందుకు అనుమతి నిరాకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ , జోష్ హేజిల్‌వుడ్ వంటి ఆటగాళ్లు వివిధ కారణాలతో ఐపీఎల్ 2026లో ఇంకా ఆడలేదు. ఫిట్‌నెస్ పరీక్షలలో ఉత్తీర్ణులు కాలేదని శ్రీలంక క్రికెట్ బోర్డు వనిందు హసరంగా, ఈషాన్ మలింగ, మతీష పతిరానా ఎన్వోసీ ఇవ్వలేదు.

# బుమ్రా బౌలింగ్‌లో స్కోరు చేస్తానని చెప్పి చేసి చూపించాడు... అతడ్ని టీమిండియాలోకి తీసుకోవాలి: ఇర్ఫాన్ పఠాన్ వ్యాఖ్యలు





**హైదరాబాద్ పెన్ పవర్:** "గత ఏడాది బుమ్రా బౌలింగ్‌లో ఔటయ్యాను. ఈసారి అతడి బౌలింగ్‌లో పరుగులు చేయాలి"... ఇది ఐపీఎల్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పెట్టుకున్న లక్ష్యం. చెప్పడమే కాదు, గతరాత్రి ముంబై ఇండియన్స్ తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ స్థాయి బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో

దూకుడుగా ఆడి దాన్ని చేసి చూపించాడు. ఈ అద్భుత ప్రదర్శనపై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంసల వర్షం కురిపించాడు.వైభవ్ ప్రదర్శనపై స్పందించిన ఇర్ఫాన్, అతడిని వెంటనే జాతీయ జట్టులోకి తీసుకోవాలని బీసీసీఐకి సూచించాడు. "వైభవ్ ఒక యువ సంచలనం. 15 ఏళ్ల వయసులో వైట్ బాల్ క్రికెట్‌లో ఇంతటి పరిణతితో కూడిన ప్రదర్శన అసాధారణం. బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కోవడం చాలా కష్టం. అలాంటిది, అతడిపై పరుగులు చేస్తానని చెప్పి, చేసి చూపించాడు. తన లక్ష్యాన్ని చేరుకున్నాడు" అని ఇర్ఫాన్ కొనియాడాడు."ఈ కుర్రాడిని ఎక్కువ కాలం వేచి చూసేలా చేయొద్దు. ఇప్పుడే జాతీయ జట్టులోకి తీసుకుంటే, అతడు సుమారు 20 ఏళ్ల పాటు దేశానికి సేవలందించగలడు" అని ఇర్ఫాన్ అభిప్రాయపడ్డాడు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 14 బంతుల్లోనే 39 పరుగులు బాది అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో అగ్రశ్రేణి బౌలర్లను సైతం ఎదుర్కొని నిలకడగా రాణిస్తుండటంతో, ఇర్ఫాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# పర్ఫెక్షన్ కోసం వెనుకడుగేసిన ఎన్టీఆర్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో భారీ ప్రాజెక్ట్ డ్రాగన్ ప్రస్తుతం అనూహ్యంగా వార్తల్లో నిలిచింది. ఈ నెలలో ప్రారంభం కావాల్సిన కీలక షూటింగ్ షెడ్యూల్ అకస్మాత్తుగా నిలిచిపోవడంతో, సినిమా రిలీజ్ పై సందేహాలు నెలకొన్నాయి. ఇప్పటికే ప్రకటించిన రిలీజ్ డేట్ మిస్ అయ్యే అవకాశాలు కనిపిస్తుండటంతో అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది.

**లుక్ తో అసంతృప్తి**

అయితే ఈ బ్రేక్ వెనుక ఉన్న కారణం ఏదో నార్మల్ రీజన్ కాదు. సినిమా కోసం రెడీ చేసిన కొత్త లుక్ విషయంలో ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇద్దరూ పూర్తిగా సంతృప్తి చెందకపోవడంతో షూట్‌ను ఆపాలని డిసైడ్ అయ్యారట. పర్ఫెక్షన్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, లేటైనా సరే బెస్ట్ అవుట్‌పుట్ ఇవ్వాలనే దృఢ సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

**మే లో కొత్త షెడ్యూల్**

కాగా ఈ సినిమాలో ఎన్టీఆర్ పలు వేరియేషన్లలో కనిపించనున్నారని తెలుస్తోంది. మల్టిపుల్ లుక్స్‌తో పాటు కొత్త గెటప్స్‌పై ప్రయోగాలు జరుగుతుండటంతో, ఆయన కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన పాత్రగా నిలవొచ్చనే అంచనాలను పెంచుతోంది. అభిమానులు కూడా ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ స్కేల్ పరంగా కూడా డ్రాగన్ ఓ భారీ ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ఇప్పటికే





జోర్డాన్‌లో ఒక కీలక షెడ్యూల్ పూర్తి చేసిన యూనిట్, ఇటీవల శంషాబాద్ సమీపంలోని ఆలయంలో వారం రోజులపాటు షూటింగ్ నిర్వహించింది. ప్రస్తుతం నగర అవుట్‌స్కర్ట్స్‌లో భారీ సెట్ నిర్మాణం జరుగుతుండగా, అక్కడి నుంచే వచ్చే నెలలో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్ పాన్- ఇండియా స్థాయిలో విజువల్ గ్రాండియర్‌గా నిలవబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**డ్రాగన్ విషయంలో తారక్ పై భారీ ఒత్తిడి**

ఇదిలా ఉండగా, బాలీవుడ్‌లో వచ్చిన వార్త2 తర్వాత ఎన్టీఆర్‌కు ఈ సినిమా అత్యంత కీలకంగా మారింది. వార్2 తో ఆశించిన స్థాయి విజయం దక్కకపోవడంతో, డ్రాగన్ ద్వారా ఎలాగైనా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలనే ఒత్తిడి కూడా అతనిలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే డ్రాగన్ పై అభిమానుల అంచనాలు కూడా భారీగా పెరిగాయి. సోషల్ మీడియాలో ఈ డిలే అంశంపై మిక్స్‌డ్ రియాక్షన్ కనిపిస్తోంది. కొంతమంది అభిమానులు ఇంకెంత లేట్? అంటూ అసహనం వ్యక్తం చేస్తుంటే, మరికొందరు మాత్రం మంచి అవుట్‌పుట్ కోసం సమయం తీసుకోవడం సరైన నిర్ణయమేనని టీమ్‌కు మద్దతు తెలుపుతున్నారు. మొత్తానికి, డ్రాగన్ టీమ్ తీసుకున్న ఈ డెసిషన్ రిస్క్‌తో కూడుకున్నదే. ఒకవైపు డిలే వల్ల మార్కెట్‌లో ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, మరోవైపు పర్ఫెక్ట్ అవుట్‌పుట్ సాధిస్తే అది భారీ రివార్డ్‌గా మారే అవకాశం ఉంది. కంటెంట్‌పై ఉన్న కాన్ఫిడెన్స్, క్లియర్ విజన్‌తో ముందుకు సాగుతున్న ఈ ప్రాజెక్ట్ నిజంగా తారక్ లైఫ్ లో గేమ్ ఛేంజర్ అవుతుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965